


గంగా నది గంభీరంగా సాగిపోతూంది. ఒక రేవు దగ్గిర గట్టు మీద మెట్లమీద బ్రాహ్మలు నిలబడి స్నానాలు చేస్తున్నారు. పైపంచలు ఝాడించుకుంటున్నారు. మొలలోతు నీళ్ళల్లో నిలబడి సూర్యుని ధ్యానిస్తున్నారు. అర్ఘ్యాలు విడుస్తున్నారు. మెట్లమీద నిలబడి కొందరు సూర్యనమస్కారాలు చేస్తున్నారు. రేవులో అంతా గోల గోలగా ఉంది. ఒక పక్కగా నిలబడి దీక్షలో ఒక యువకుడు ముక్కుమూసుకుని ధ్యానించి నీటిలో మునిగిలేస్తున్నాడు. మళ్ళీ మళ్ళీ మునిగిలేస్తున్నాడు. 'శివ శివా! శివ శివా!' అంటూ మళ్ళీ మళ్ళీ మునిగి లేస్తున్నాడు. అంగవస్త్రం పిడిచి కట్టుకుని ఎవరినీ తాకకుండా ఒదిగి ఒదిగి పోతూ మెట్లెక్కి విశ్వేశ్వరాలయంవైపుగా నడిచి పోయాడు. స్నానాలు ముగించిన చాలామంది విశ్వేశ్వరాలయానికి దారితీస్తున్నారు. విశ్వేశ్వరాలయపు గంటలు ఖంగుమంటూ పదేపదే మ్రోగుతున్నాయి. ఆ శబ్దం గాలిలో తేలి దూరతీరాలని నింపుతూ భక్తులకి ఆహ్లాదం కల్గిస్తూంది. భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది.

యువకుడు తిన్నగా వెళ్ళి గర్భగుడికి ఎదురుగా నిలబడి చేతులు జోడించాడు. అర్ధనిమీలిత నేత్రాలు భక్తిపారవశ్యంతో తొణికిసలాడుతున్నాయి. గంభీరంగా ఉన్న కంఠమెత్తి శివస్తుతి చేయడం ప్రారంభించాడు. ఒక్క క్షణంలో ఆలయంలో నిశ్శబ్దం ఏర్పడిపోయింది. అడపాతడపా మ్రోగే గుడిగంటల మధ్య యువకుని శివస్తుతి చెవికింపుగా ఒళ్లు పులకరించేటట్లుగా భక్తులకి విన్పిస్తూంది.

చుట్టూ వాతావరణాన్ని గమనించే స్థితిలో లేడు యువకుడు. దైవంమీదే మనస్సు లగ్నంచేసి చెవులకింపుగా పఠిస్తున్నాడు. చుట్టుపక్కల ఉన్నవారంతా ఆ హాయిగొల్పుతున్న స్తుతివింటున్నారు.

"హరం సర్ప హారం చితాభూవిహారం
భవం వేద సారం సదా నిర్వి కారం
శ్మశనే వసంతం మనోజం దహంతం
శివం శంకరం శంభు మీశన మీడే"

అంటూ స్తవం పూర్తిచేసి సాష్టాంగ పడ్డాడు.

అప్పటివరకూ ఆ యువకుణ్నే చూస్తూ తన్మయుడై పోయిన ఓ ముదుసలి బ్రాహ్మణుడు ఆత్రంగా ముందుకొచ్చి యువకుణ్ని సమీపించాడు. "నాయనా నీ శివస్తుతి విని నా చెవుల తుప్పు వదలి పోయింది. ఎవరి అబ్బాయివి? ఎవరు నేర్పారు—యీ ఏకాగ్రత నీకు? ఏ వూరు బాబూ మనది?" అంటూ ప్రశ్నల పరంపర కురిపించాడు.

యువకుడు భక్తి శ్రద్ధలతో వృద్ధ బ్రాహ్మణుని చూసి "మాది మునిఖండ గ్రామం స్వామీ. గోదావరి తీరంలోని పుణ్య పూరితమైన అగ్రహారం మాది. పేరిభట్లుగారు మా తండ్రిగారు. నా పేరు జగన్నాధుడు" అంటూ నమస్కరించాడు. 'అలాగా' అంటూ ముదుసలి బాపడు కుర్రవాని భుజం తట్టాడు. "నిజంగా నీ ఏకాగ్రత మహా తపస్వులకు సహితం కష్టతరం. నీ తండ్రిగారి పేరేమిటన్నావు?" అంటూ రెట్టించి అడిగాడు.



యువకుడు చిరునవ్వు నవ్వి "పేరు పేరే. పేరిభట్టు పాషాణం లోంచి సహితం పీయూషం పిండగల పండితోత్తములు వారు." అన్నాడు.

ముసలాయన తల తాటించాడు. ఆలయందాటి ఇద్దరూ బయటికి నడిచారు. "ఇక్కడి కెందు కొచ్చావు?" సూటిగా ప్రశ్నించారు. జగన్నాధుడు ముసలాయిన పక్కన కొద్దిగా వంగి నడుస్తూ "నేను విశ్వేశ్వర సన్నిధానంలో విద్య నభ్యశించాలని మా నాన్నగారి కోరిక. వారి గురువులు శ్రీ శేషవీరేశ్వరులు వారిక్కడనే ఉన్నారట స్వామీ. వారి పాదసన్నిధినే నేనూ వేద వేదాంగాలు వల్లె వేయాలని ఈ పుణ్యనగరుకి వచ్చాను. మీరేదైనా దారి చూపగలరా స్వామీ?" వినయంగా ప్రశ్నించాడు జగన్నాధుడు.

ముసలాయనకి ఉత్సాహం పెల్లుబికింది. 'నాయనా, జగన్నాధా నీ తండ్రితోపాటు నీజన్మకూడా సార్థకం చెయ్యి. నేనే ఆ వీరేశ్వరుణ్ని. రా, నాయనా, నాతోపాటు గురుకులానికి రా. అక్కడ అన్ని సదుపాయాలూ ఉంటాయి. నీకిష్టమైనన్నాళ్ళు విద్యార్థిగా ఉండి నన్ను ఆనందింపచెయ్యి.' అంటూ జగన్నాధుని చేయి అందుకుని ముందుకి సాగిపోయాడు.

జగన్నాధుడు చేయి వదలించుకుని ముదుసలికి సాష్టాంగ నమస్కారం చేసి లేచి నిలబడ్డాడు. "విశ్వేశ్వర సాన్నిధ్యంలో నాకు విద్యాభిక్ష లభించింది. నాజన్మ సార్థకం అయింది. పదండిస్వామీ ఈ దినం మొదలు మీ నీడనై నేను విద్యనభ్యసిస్తాను."

జగన్నాధుడూ వీరేశ్వర గురుపాదులూ ఆలయందాటి బయటికి సాగారు. ఆలయము గంటలు మ్రోగుతూనే ఉన్నాయి. ఆ చప్పుడు అంతకంతకి దూరం కాసాగింది.

## 2

గురుకులంలో పదిమందితోపాటు శాస్త్ర విద్యలో వేదపఠనంలో ప్రావీణ్యం సంపాదించడం ప్రారంభించాడు జగన్నాధుడు. అతడేక సంతగ్రాహి. వాదప్రతివాదాలతో, ఉబుసుపోక పోటీలతో విద్యార్థులలో తలమానికంగా రూపొందాడు జగన్నాధుడు. వీరేశ్వరునికి గర్వకారణం కాదగిన శిష్యునిగా తయారయ్యాడు. జగన్నాధుడు తీరికగా కూర్చుని అరోజున చిత్ర మీమాంసాఖండనం ప్రారంభించాడు. అతనికి అడ్డుతగులుతూ డిండిమభట్టు తన ప్రతిభ చాటుకోవాలని తాపత్రయ పడుతున్నాడు. "ఓహో ఏమివివరణ! నువ్వు చెప్పిందేనా ఏమిటి? ఇంకోలా ఎందుకు వివరణ చెప్పకూడదు?" అంటూ నిలవేశాడు.

జగన్నాధుడు తన స్నేహితుని కేసి చూసి సన్నగా నవ్వాడు. "డిండిమా నీతో వాద ప్రతివాదన వృధాప్రయాస! ఎందుకంటావా? నేవివరించినా నువ్వు గ్రహించలేవు." అన్నాడు. "అయింది అయింది భట్టుగారిపని' అని మిగిలిన విద్యార్థులు హేళనచేస్తూ "భట్టు! భట్టు! డిండిమభట్టు" అంటూ రాగవరసగా చప్పట్లు చరిచి అల్లరి చేయడం ప్రారంభించాడు. డిండిమభట్టుకి ఉడుకుమోతుతనం వచ్చింది. "ఉరిమే మేఘంలాగా ధ్వనేగాని లోతులేదు నీవాదనలో. కానీలే. ఏనాటికైనా ఈనాటి నీగర్వ ప్రదర్శనకి తగినపాఠం చెప్పక పోను." అంటూ లేచి బయటికి నడిచి పోయాడు.

వీధిలో జనం కోలాహలంగా ఉన్నారు. 'ఏమిటా కోలాహలం' అంటూ కుతూహలంగా జగన్నాధుడూ అతనితోపాటు అందరూ వీధిలోకి నడిచారు.

మార్గం పక్కగా ఉన్న ఓ చెట్టు కింద నిలబడి ఒక భటుడు పాదుషావారి ఫర్మానా బిగ్గరగా అక్కడ గుమిగూడిన జనానికంతా స్పష్టంగా వినబడేలా—బిగ్గరగా చదువుతున్నాడు. "షాజహాన్ పాదుషా వారి పుత్రికారత్నం రాకుమారి లవంగి విశ్వేశ్వర దర్శనార్థం వేంచేసి ఉన్నారు. రాకుమారి దేవాలయ ప్రాంతాలకు వేంచేసినప్పుడు వైదొలగి తగు మర్యాదల నివ్వవలసినదిగా చెప్పడమైనది" చదవడం ముగియగానే డప్పులవాద్యం మ్రోగింది, భటుడు ముందుకు సాగిపోయాడు, జనంలో గుసగుసలు ప్రారంభం అయ్యాయి. "మహమ్మదీయ వనిత అయివుండీ, హిందూ దేవాలయం ప్రవేశిస్తుందా?" అంటూ పండు ముదుసలులు, ఛాందసులు వాపోయారు. మతావేశం ఎక్కువగా కల కుర్రవాళ్లు సహితం ఈ దండోరా విని అబ్బురపడ్డారు.

"నమాజుకు స్వస్తి చెప్పి శివార్చన ప్రారంభిస్తుంది కాబోలు రాకుమారి!" అంటూ హేళన చేశారు కొందరు.

"కలికాలం బాబూ, యింకా ఏం కష్టాలు రానున్నాయో" నిట్టూరుస్తూ చేతి కర్ర గట్టిగా నేలకి కొట్టుకుంటూ జనాన్ని తప్పించుకొని వెళ్ళిపోయూ డొక వృద్ధ బ్రాహ్మణుడు. దండోరా విన్న జగన్నాధుడు చేతలుడిగి అలాగే నిలబడి పోయాడు. అతని చుట్టూ విద్యార్థులు చేరారు. "మనం ఈ అన్యాయాన్ని అరికట్టాలి. మన మతం, మన ఆలయ పవిత్రత మంట కలిసిపోయి ఉంటే చూస్తూ ఊరుకుంటామా? మనమేం గాజులు తొడిగించుకున్నామా? హుంక

రించా ధోక ఆవేశపరుడు.

జగన్నాధుడు ఆలోచనలో పడ్డాడు. అతనికి ఎటూ దారి తోచడం లేదు. "లేకుంటే యేం చేయగలం. పాదుషా వారి కుమార్తెను కోరి కాదంటామా!" సాలోచనగానే అన్నాడు.


డిండిమభట్టు కీ వార్త మత్తు కల్గించిందనిపించింది. అతని ఆవేశానికి హద్దు లేకుండా ఉంది. "పాదుషా అయేది? ఎవరయేది? కూడని పని తలపెట్టితే ప్రతిఘటించడం పౌరలక్షణం. అందరం కలిసి ప్రతిఘటిద్దాం" అంటూ అరిచాడు. జనంలో ఈ మాట అంచీల మీద ప్రాకి పోయింది. 'అవును రాకుమార్తె ఆలయ ప్రవేశం ప్రతిఘటిద్దాం. ఆమె రాకను అరికట్టాలి. అరికట్టాలి" అంటూ అరవడం ప్రారంభించారు.

జగన్నాధునికీ యుద్ధ సందడి అంతగా రుచించలేదు. అందుకే శాంతంగా నచ్చచెప్పాలని చూశాడు. "దైవ సాన్నిధ్యంలో అందరూ సమానులే. ఈ హెచ్చు తగ్గులు మానవుడు సృష్టించినవి. మానవ కల్పితం అయిన మతాలు సృష్టించినవి. మీరు శాంతంగా ఆలోచించండి. దైవం మనని మానవుడుగానే కటాక్షిస్తున్నాడుగాని మతాల వారీగా వరాలనివ్వడం లేదే! అన్నాడు డిండిమభట్టు వెకిలిగానవ్వాడు. "అశాస్త్రీయమైన నీ దృక్పథం నీ అనుచరులకు బోధిద్దువుగానిలే. ఇప్పుడు ఈ అపకారం జరక్కుండామటుకు చూడు" అని హెచ్చరించాడు.

అప్పటివరకూ తన శిష్యుల వాదోప వాదాలని దూరంనుంచే వింటూన్న వీరేశ్వరులవారు జగన్నాధుని సమీపించి నాయనా, "నీవన్న దానిలో దోషం లేదుగాని మంది మాట పాలింపవలసిన ధర్మం ఉంది. అందరూ వద్దు అని వారిస్తున్న పనిని అంతగా ప్రోత్సహించడం ఇంగితంకాదు. అందరూ కోరినది నువ్వు చేస్తావని నా దృఢమైన విశ్వాసం జగన్నాధా" అంటూ జగన్నాధుని భుజంపై చేయివేశారు. జగన్నాధుడు తన భుజంపై ఉన్న గురువుగారి చేతిని కళ్ళకి అద్దుకున్నాడు. "గురుదేవా, నేనన్నది తప్పు కాదన్నారు. అంతేచాలు. మీరు చెప్పిన మాటను నేను ఆజ్ఞగా శిరసావహిస్తాను స్వామీ" అన్నాడు.

"కాదనవని తెలుసునయ్యా నాకు, డిండిమా మీ రంతా యెలా నిర్ణయించుకుంటారో అలాగే కానివ్వండి" అని తమ కుటీరంవైపు నడిచారు వీరేశ్వరస్వామి.

డిండిమ భట్టుకు గజారోహణం చేసినంత గర్వం కలిగింది. "అందరూ దగ్గిరగారండి" అంటూ కేకలు వేశాడు. అక్కడ గుమిగూడిన అందరూ 'ఏమిటి?' ఏమిటి అంటూ జగన్నాధునీ, అతని చుట్టూ ఉన్న విద్యార్థులనీ చుట్టుముట్టారు. "ఆలయపు నలుదిక్కులా మేం కాపలా కాస్తాం. దేవాలయపు కవాటాలు బంధించి వేస్తాం, భక్తులు ప్రవేశించడానికి త్రోవ ఇస్తాంగాని, అనుమానాస్పదులైన ఎవరినీ అనుమతిలేనిదే లోనికి పోనీయం. అంటూ చెప్పి జగన్నాధుని కేసి తిరిగి "జగన్నాధా ఎందుకైనా మంచిది నువ్వు ఆలయపు లోపలి




ప్రాంగణంలో గస్తీ తిరుగు. నీకు సహాయంగా కొందరు ఉంటారు సరేనా?" కాదని అంటాడేమోనన్న అనుమానం ధ్వనిస్తూ అడిగాడు డిండిమభట్టు. ఏమాత్రం ఆవేశంగాని, తొందరపాటుగాని కానరానీయకుండా జగన్నాధుడు అతి సౌమ్యంగా "అలాగే కానీయవయ్యా" అన్నాడు.


## 3

క్రౌశి పొలిమేరల్లో గంగానదీ తీరాన దేరాలు వేసి రాకుమారి విడిది చేస్తూంది. సాయం సమయం. అప్పుడే వెల్గును తరిమికొట్టిన చీకట్లు లోకాన్ని ఆక్రమించుకోవాలని తాపత్రయ పడుతున్నాయి. ఆ వెలుగు చీకటుల సమ్మేళనంలో అప్పుడప్పుడే వెల్గించిన దీపాలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఆ దీపాల మధ్య దేరాలు ముడుచుకు కూర్చున్న బాతుల్లా ఉన్నాయి.

రాకుమారి దేరా సువిశాలంగా ఉంది. అన్ని దేరాల్లోకీ హుందాగా ఉంది. లోపలి భాగంలో చెలికత్తెతో కబుర్లు చెప్తూ అలంకరణ పూర్తి చేసింది రాకుమారి. ఒకసారి "ఇదే తుదిసారి" అంటూ నిలువుటద్దం ముందు నిలబడి తన ప్రతిబింబాన్ని తనివితీరా చూసుకొని "యింక బయలుదేరుదామా?" అంది. అప్పటిదాకా ఈ అవకాశం కోసమే చూస్తున్న రాకుమారి ప్రియసఖి "రాకుమారీ యిది విన్నారా? ఒక వీరకుమారుడు దేవాలయపు లోపలి ప్రాంగణంలో గస్తీ తిరుగుతున్నాట్ట. ఆలయపు ప్రాంతాలంతా యువకులు కాపలా కాస్తున్నారట."

రాకుమారికి దానిలో విపరీతం ఏం కన్పించలేదు. చేతులనున్న ఆభరణాలను సరిదిద్దుకొంటూ 'అలాగా!' అంది అతి నాజూకుగా.

చెలికత్తెకి ఆశ్చర్యం వేసింది. 'నే నింతటి గంభీరమైన వార్త చెప్తే 'అలాగా అంటూ ఊరుకున్నారేం రాకుమారీ' అని అడిగి "మనం ఆలయంలోనికి యెలా వెడతామిక? మనం లోపలికి రాకుండానే ఈ కట్టు దిట్టాలు. తమరి కది స్ఫురింపనేలేదా?" వేళాకోళంగా ప్రశ్నించి లవంగి గెడ్డం కింద చేయివేసి ముఖం పైకెత్తింది.




లవంగి కుమారి ఓ క్షణంసేపు చెలికత్తె ముఖంలోకి అలాగే చూస్తూ ఉండిపోయింది. ఆమె కనుల్లో ఆమె మనస్సులో మారుతున్న భావాల వేగం కన్పిస్తూంది. ఏదో ఒక చిలిపి ఊహ కదలాడినట్టుగా। ఆ కళ్ళే చెప్పుతున్నాయి. చేతినున్న కంకణాలు తీసివేస్తూ 'చెలీ ఈ ఆభరణాలన్నీ త్వరత్వరగా తీసివేయి. అంటూ త్వరితగతిని అన్నీ తీసివేయడం ప్రారంభించింది. శిరోభరణాలన్నీ తీసివేస్తూ అయితే తమరి ప్రయత్నం విరమించు కొన్నట్టేనా? చూశారా. అందుకే స్త్రీలని బేలలని అబలలని అంటారు. ఈ వాలుజడ చూశారా?' జడ అల్లికలు తీయడానికి ప్రారంభిస్తూ అడిగింది "ఊఁ ఊఁ" అని తలాడిస్తూ పై దుస్తులను తీసే హడావిడి ప్రారంభించింది లవంగి. "ఏవరే బేలలు! ఎవరే అబలలు? చూస్తూవుండు. ఢిల్లీ నగరంనుంచి ఇంత దూరం వచ్చినది విశ్వేశ్వర దర్శనం కోసం. కాని—ఈ వీర పుంగవుణ్ణి చూసి పోవడానికా?" అని 'ఏమో చివరికి అంతే జరుగుతుందేమో' అని తన సందేహం వెలిబుచ్చింది చెలికత్తె. లవంగి కోపంతో బుసలుకొట్టింది. 'అలా ఎప్పటికీ కాదు. అటు సూర్యుడు యిటు పొడిచినా సరే నేను ఆలయ ప్రవేశం చేసి తీరుతాను. ఓ క్షణం ఉండు' అంటూ లోపలి భాగంలోకి పరుగెత్తింది లవంగి. తన రాకుమారి పట్టుదల నెరిగిన చెలికత్తె కూడా లోపలికి పరుగెత్తింది.

దేరాకి పహరా కాస్తున్నభటుణ్ణి నిలవేశాడు అసఫ్‌ఖాన్. 'రాకుమారి ఎక్కడ?' అడిగాడు 'రాకుమార్తె చెలికత్తె నిలా రమ్మను.' అంటూ హుంకరించాడు.

భటుడు లోపలికి పరుగెత్తి చెలికత్తెని పిల్చుకు వచ్చాడు. అసఫ్‌ఖాన్‌ని చూసి వంగి సలామ్ పెట్టింది చెలికత్తె. "ఈ నాటికి రాకుమార్తెని విశ్రాంతి తీసుకోమని కోరడానికి వచ్చాను. మనకి ఢిల్లీనుంచి కావలసిన రక్షణ వస్తుంది. బహుశా చక్రవర్తే వచ్చినా రావచ్చు."

"ఎందుకనో తెలుసుకోవచ్చునా?" అడిగింది చెలి.

"ఎందుకేమిటి? రాకుమారి రాకని ఆలయప్రవేశాన్ని ఈ రీతిగా అటకాయించినందుకు కాశీప్రజ మన శక్తిని రుచి చూడవద్దా?" మీసం దువ్వాడు అసఫ్‌ఖాన్.

చెలికత్తెకి నవ్వు వచ్చిందీ గాంభీర్యం చూసి. అందుచేతనే కొంటెగా "అందుకని?' అంటూ తిరిగి ప్రశ్నించింది.

"అందుకనే సైన్యాన్ని పిలిపించడం. రాకుమారి దారికి అడ్డం నిలచిన వారిని నిర్దాక్షిణ్యంగా యీడ్చి పారేస్తాం. రాకుమారి ఆలయంలోకి వెళ్ళినప్పుడు ఒక్క పురుగుకూడా ఆ చుట్టుపక్కల లేకుండా చేస్తాం." అన్నాడు అసఫ్‌ఖాన్.

"అలాగా' అంది నిదానంగా చెలికత్తె.

"అలాగే" అని చెలికత్తెని చూసి దొంగనవ్వులు నవ్వుతూ "ఇంతకీ రాకుమారి ఎక్కడ?" ప్రశ్నించాడు.

"ఆలయానికి ప్రయాణం విరమించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు" అంది.

"సరే. మేం వస్తాం" అన్నాడు అసఫ్ ఖాన్. "చిత్తం వెళ్ళి రండి" అంటూ గుడారంలోకి పరుగెత్తింది చెలికత్తె.

అప్పుడే అలంకరణ ముగించి దేరా అంతర్భాగంలోంచి యివతలికి వస్తూన్న లవంగిని చూసి చేష్టలుడిగి నిలబడిపోయింది చెలికత్తె. ఒక్క పరుగున వెళ్ళి లవంగిని కౌగలించుకొంటూ "ఎంత అందంగా ఉన్నారు" అంది.

లవంగి చేటి చేష్టలు వారిస్తూ 'నువ్వూ త్వరగా సిద్ధంకా. మనం యిప్పుడే బయలుదేరి దేవాలయపు చుట్టుపక్కలంతా కలయ తిరిగి తరువాత ఆలయంలో ప్రవేశించి దైవదర్శనమో, పరాభవమో చేసి వద్దాం. ఏదో ఒకటి తప్పదీ రోజు.'

## 4

నడుముకి కాశికోకలు బిగించికట్టి చేతుల్లో చేపాటి కర్రలతో రోడ్ల మీద యువకులు గస్తీ తిరుగుతున్నారు. ఆలయానికి దారి తీసే రహదారులన్నీ జనంతో సందడిగా ఉన్నాయి. ఆలయం ముందు భక్తులు గుంపులు గుంపులుగా ఉన్నారు. ఆలయ సింహద్వారం మూసివేసి ఉంది. భక్తులు పక్క కవాటంలోంచి లోపలికి వెడుతున్నారు. ఆ జనసందోహంతో కలిసిపోయి తిరుగుతున్నారు లవంగీ రాజకుమారీ, ఆమె చెలికత్తే. భక్తుల వరుసలో నిలబడిన లవంగీ, చెలికత్తెకూడా పక్కద్వారం వెంట ఆలయంలోకి ప్రవేశించారు.

ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణాలు చేయడం ముగించారు. లోపలి ప్రాంగణంలో జగన్నాధుడూ, అతని స్నేహితుడూ అనుమానాస్పదంగా కన్పించే వారెవరైనా లోనికి ప్రవేశించారా అని పరిశీలనగా చూస్తూ తిరుగుతున్నారు.

ప్రదక్షణలు ముగించిన లవంగి గర్భగుడి ప్రాంగణం ప్రవేశించబోతూంది. ఒక దృఢమైన చేయి అడ్డంగా నిలచి అటకాయించింది. "ఆగండి, దైవసాన్నిధ్యంలోనైనా ఆ అహంకార చిహ్నమైన తలపాగాలు తీయరా?" గంభీరస్వరంలో అడిగాడు జగన్నాధుడు. లవంగి కన్య కన్నార్పక అతగాడ్నే చూడసాగింది. "మాకు పాగాలు



తీయడం శాస్త్రసమ్మతం కాదు'' అంది—మగవాడి గొంతుకతో మాట్లాడుతూ. ''మేం తలపాగా తీస్తే ఎదుటివారిని అవమానించినట్టే. దైవసాన్నిధ్యంలో మమ్మల్ని ఇలాంటి కూడని పని చేయనీయకండి'' అంది.

జగన్నాధునికీ వాదం వితండంగా కన్పించింది. అతని పెదవుల మీద సన్నని దరహాసం పొడచూపింది. ''మీరే దేశస్థులు? భగవంతునికి సహితం సాష్టాంగ నమస్కారం చేయరా ఏమిటి?'' అని ప్రశ్నించాడు.

వెలుపలి ద్వారందగ్గిర గోల ప్రారంభం అయింది. ''జగన్నాధా, జగన్నాధా ఓ క్షణం ఇక్కడికి వచ్చి వెళ్ళు'' అంటూ బలరాముడు కేకవేశాడు. జగన్నాధుడు అవతలి ద్వారంవైపు శీఘ్రంగా నడిచాడు.

అదే క్షణంలో ''నడు యిదే అదను. మన పని ముగించుకుని వద్దాం. గట్టివాణ్ణే పెట్టారు కావలి? అంటూ దైవసన్నిధికి సాగింది లవంగి. భగవంతుని మనసారా సేవించి తిరిగి వచ్చేస్తూండగా జగన్నాధుడు వారి కెదురయ్యాడు. అతనికి ఆవేశం పొంగివచ్చింది. తన కుడిచేత్తో లవంగి భుజం గట్టిగా పట్టుకుని ఒక్క గుంజు గుంజి ''ఎంతటి దురహంకారం'' అని అనేలోగానే లవంగి తన చేత్తో జగన్నాధుని చేయి విడిపించపోయింది. జగన్నాధుని చేయి విసురుగా పైకి లేవడంతో—లవంగి కుచ్చు తలపాగా నేలమీద పడింది. సుదీర్ఘంగా కారుమబ్బుల్లా ఉన్న ఆమె కురులు ఒక్కసారిగా జలపాతంలా భుజాలు దిగి నడుము కిందదాకా జారాయి. లవంగి యీ హఠాత్ సంఘటనకి ఎంత అదరిపడిందో జగన్నాధుడూ అంతగానూ అదరిపడ్డాడు. ''ఆఁ'' అంటూ చెలికత్తె చేయి నోటికి అడ్డం పెట్టుకుంది. జగన్నాధుని దృష్టి లవంగి ఆకారాన్ని విడిచి రావడంలేదు. ''క్షమించండి. మేం వెళ్లిపోతాం'' అంది దీనంగా చెలికత్తె. కోపంతో నిప్పులు చెరగుతున్న అతని చూపులు నెమ్మదిగా మార్దవం అయ్యాయి. అంతే కాదు. అదే క్షణంలో పరస్త్రీ చేయి పట్టుకున్నాన్న జ్ఞానోదయం కల్గడంతో ఆమె జబ్బను గుచ్చిపట్టుకుని ఉన్న తనచేయి హఠాత్తుగా తీసివేశాడు. లవంగి సిగ్గుతో ఎర్రబడిన ముఖం

With Compliments :

**KAMINENI WIRES**

5 - 9 - 261, KING KOTHI ROAD

**HYDERABAD - 1.**

క్రిందికి దించి తన చెలికత్తె వెనుక దాక్కుంది. భక్తుల గుంపులు చుట్టుముట్టి ఈ మూకాభినయాన్ని వింతగా చూడసాగారు. ఏమిటో హడావిడి అని డిండిమభట్టుకూడా జగన్నాధుని చేరాడు. ఒక్కక్షణంలో అంతా పసికట్టి "వెళ్ళండి ఆలయద్వారాలు తెరవండి" అంటూ కేక వేశాడు. జగన్నాధుని కుతూహలంగా చూస్తూ మొత్తానికి అటు గురువుల మాటా జవదాటలేదు. ఇటు చేయదల్చినదీ చేశావు. నేర్పు అలా ఉండాలి. పాణిగ్రహణం జరిపించేశావు!" హేళన చేశాడు.

ఈ హేళన తన అనుంగు నెచ్చెలి జగన్నాధునికి సూటిగా తగలడం చూసి బలరామునికి కోపం వచ్చింది. 'అఘోరించావులే. అసలీ కన్నెపిల్ల ఎవరో ఎవరికి తెలుసు?' అన్నాడు. 'ఆహా! తెలియదా? తెలియకుండానే ఆలయంలోకి రానిచ్చాడా?' ఎద్దేవా చేశాడు.

శిష్యులు తెచ్చిన విపరీత వార్తను విని హుటాహుటిని వచ్చారు. వీరేశ్వరులు. 'ఏమిటి జగన్నాధా, ఆడితప్పావా?' ఆశ్చర్యంగా అడిగారు. తన ప్రియతమ శిష్యుడిలా చేస్తాడని ఆయన కలలోకూడా ఊహించలేదు. జగన్నాధుడు బాధగా 'గురుదేవా, నేను మీరు యిచ్చిన మాట తప్పలేదు. కాని దైవ నిర్ణయాలు వేరుగా ఉన్నాయి కావలిస్తే మీరాభక్తురాలినే అడగండి' అన్నాడు నెమ్మదిగా.

లవంగిచేటి గురువులకి నమస్కరించింది. 'క్షమించండి స్వామీ. వారి దోషం ఏమీలేదు. మేమే మోసగించి అయినా ఆలయప్రవేశం చేయాలని నిర్ణయించుకుని ఇలాచేసాము."

'ఏది ఏమైతేనేం? జరుగకూడనిది జరిగింది. డిండిమా, ఇక మనం చేసేది ఏమీలేదు కనుక ఈ రామార్తె క్షేమంగా నివాసం చేరేలా చూసే బాధ్యతనీది సుమా.' అని జగన్నాధుని వైపేనా చూడకుండా వెళ్ళిపోయారు వీరేశ్వరులు. 'రండమ్మా రండి. తమరు చేసిన నిర్వాకం చాలు—ఇక నడవండి' అంటూ దారిచేస్తూ ముందుకు సాగాడు డిండిమభట్టు. వెనుతిరిగి జగన్నాధుని చూస్తూ అతనివెంట సాగింది లవంగి. ఆమె వెనుకనే చెలికత్తెకూడా నడిచింది. వారలా ఆలయప్రాంగణం దాటేదాకా శిలవలె నిలబడిపోయాడు జగన్నాధుడు. ఒక్కక్షణంలో తన కళ్ళముందు జరిగిన కథంతా నిజంగా జరిగిందా! లేక తను కలగన్నాడా? అన్న సందిగ్ధంలో పడ్డాడు. ఆ కన్నెపిల్ల చేయి గుచ్చిపట్టిన తనచేతిని ఓసారి పరీక్షగా చూసుకున్నాడు. 'అంతా దైవేచ్ఛ. దైవ దర్శనం కోరుకున్న వారిని అటకాయించటానికి ఎవరికుంది హక్కు?' అనుకుని తన గురుకులంవైపు సాగిపోయాడు జగన్నాధుడు.

తన పఠన మందిరంలో పద్మాసనం వేసుకుని కూర్చుని ధ్యాననిమగ్నుడయ్యాడు. చుట్టూ చీకటులు దట్టంగా అల్లుకున్నాయి.

డిండిమభట్టు పొలిమేరదాకా సాగనంపాడు రాకుమారిని. చాలా


*With best compliments*

*from :*

**T. Krishnaswamy Mudaliar**

**TILAK ROAD, HYDERABAD-1.**

దురుసుగా కోపంగా డేరాలోకి ప్రవేశించింది లవంగి. బాలీసు నానుకుని కూర్చుంది. ఆమె మనస్సు పరిపరివిధాల పోతూంది. లోపలికి వెళ్ళిన చెలికత్తె అలంకరణ సామగ్రి అంతా పట్టుకుని వచ్చి లవంగికన్నె పక్కనే నిలబడింది. 'రాకుమారీ, యీ రాత్రి పూట ఆ పురుష వస్త్రధారణ చేసి నువ్వెందుకో వింత అందంతో ప్రకాశిస్తున్నావు సుమీ.' అంటూ అలంకరణ సామగ్రి పక్కనే ఉన్న మేజామీద పెట్టింది.

లవంగి ఆత్రంగా చెలి వెంతకు వచ్చింది. 'నేనొకటి అడుగు తాను వేళాకోళం చేయకుండా చెప్తావా?' అంటూ చేతులు పట్టుకొంది.

చెలికత్తె తమాషాగా తలవంచి 'నువ్వు సంతోషించు' అని హుకుమ్ జారీచేసేదాకా నవ్వనుకూడా నవ్వను. సరేనా?' అంది సన్నగా నవ్వుతూ.

లవంగి బుంగమూతి పెట్టింది. "మాడివిగో, అప్పుడే వేళా కోళం చేస్తున్నావు."

"లేదు లేదు. రాకుమారీ, నువ్వు చెప్పేదేమిటో ఊహించుకొని నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలియడం లేదు. త్వరగా చెప్పు మరీ' అంది బ్రతిమాలుతున్నట్టు లవంగికన్య చుబుకం పట్టుకుని.

లవంగి సిగ్గుతో కెంపులైన తన చెంపలని చెలిభుజంపై ముఖం పెట్టి దాచుకుంది. చెలిముఖంచూస్తూ ఏం చెప్పకలదు? పక్కకి ముఖమైతే ధైర్యంగా పైకి అనగలననుకున్న ఆమె మాటలు గుసగుసలే అయ్యేయి. 'దేవాలయంలో' అన్నముక్కవిని 'ఆఁ దేవాలయంలో?' అంటూ అదే ప్రశ్నగా వేసింది చెలి.

కోపంనటిస్తూ చెలి ముఖంలోకి చూసి 'మనని అడ్డగించిన యువకుడు 'చాలా మోటువాడుసుమీ' అంది. 'అవునవును. అందుకేగా అసఫ్ఖాన్‌జీ సేనలతో రమ్మని చక్రవర్తికి వర్తమానం పంపుత. రేపీపాటికా వీరులంతా ప్రాణరక్షణ కోసం పరుగులు తీయరూ?' గట్టిగా నవ్వేసింది చెలి.

ఆ మాటవిని ఉలిక్కిపడింది లవంగి. ఆత్రంగా 'ఏమిటి నువ్వనేది? నేనుట్టినే మనలోమనంగా చెప్తుంటే' అంది.

లవంగిని ప్రశాంత పరిచేటందుకు కూర్చోపెడుతూ 'అవును రాకుమారీ, మన ప్రయాణానికి కొంచెం ముందే అసఫ్ఖాన్‌జీ వేంచేశారు. ఈ నాడు దైవదర్శనానికి పోవద్దని చెప్పవచ్చారు. కాని....' ఆగింది

'కాని? మనం వెళ్ళడం తప్పయిందంటావా చెలీ?' సూటిగా అడిగింది లవంగి.

'కాదామరి,' అంది చెలికత్తె అనుమానంగా. 'రేపు చక్రవర్తికి ఏమని చెప్తాం?' భయంగా అడిగింది. లవంగి ముఖ కమలం పై


*WITH BEST COMPLIMENTS FROM:*

**BIOLOGICAL EVANS LIMITED**

BOMBAY CALCUTTA AGRA HYDERABAD



విషాదఛాయ పడింది. పక్కనున్న బాలీసుపై వాలింది. 'చెలీ' అందే కాని తన నిడుపాటి కురులను మృదువైన వేళ్ళతో రాసుకుంటూ ఆలోచనలో పడింది.

"ఏమిటి రాకుమారీ. మీ రెందు కిలా మౌనం వహించారు?" ఆత్రంగా అడిగింది చెలి.

"పాపం. అమాయకుడు. నా వేణీబంధంకేసి ఎంత వింతగా చూశాడు!" తనలో తనుగా అనుకుంది.

చెలి కిలకిల నవ్వేసింది. "వేణీబంధం కేసా? ముఖచంద్రుని వైపా?" అంటూ లవంగి తలకట్టు తన చేతుల్లోకి తీసుకుని చిక్కులు దువ్వడం ప్రారంభించింది.

"నా కీ రోజు జడ అల్లకు చెలీ. ఇలాగే చిక్కులుతీసి వదలి వెయ్యి."

"ఏమబ్బా అంత విరక్తి?" కుతూహలం అణచుకోలేని చెలికత్తె ఎదురడిగింది.

సాదరంగా, అతి ప్రేమాభిమానాలతో తన నిడుపాటి కురులని చేతుల్లోకి తీసుకుని "అలా వుంటేనే అందంగా వుంటుంది కాబోలు!" అంది నెమ్మదిగా.

"అవునవును. మన అందం మన కెలా తెలుస్తుందిలే" అని వేళాకోళం చేసి జుట్టు చిక్కులు తీయడం ప్రారంభించింది చెలి.

"దైవ సాన్నిధ్యంతో నా పాణిగ్రహణం చేసిన ఆ యువకుడు ఎవరై వుంటారో?" రహస్య మడుగుతున్నంత నెమ్మదిగా అడిగింది లవంగి. "నువ్వు కనుక్కోలేవా?"

"నువ్వు హుకుమ్ వేస్తే అదెంతపని రాకుమారీ!" ఉత్సాహంగా అంది చెలికత్తె.

"ప్రియ సఖులకి ఇవన్నీ మాటలలో చెప్పాలా ఏమిటే?" నవ్వింది లవంగి.

"చెప్ప నవసరంలేదు రాకుమారీ. పాపం. ఉక్కులాంటి అతగాడి చేతికి పూవులాంటి నీ చేయి తగలగానే అదిరిపోయాడు" అంటూ


*With Best Compliments of :*


UNITED STEEL ALLIED INDUSTRIES

D-4, 5, 6, Govt. Industrial Estate, Moulaali, **HYDERABAD-40**.

Phone : **71293**

FOR PRESSURE VESSELS, CHEMICAL EQUIPMENTS :

**Transmission line towers, Structural Steel Fabrication and Erection, Exothermic Compounds and Hot Top Inserts**




కొంచెం దూరంగా జరిగి "అతగాని సోయగం చూస్తూ ఈ రాకుమారీ, అటు దైవాన్ని ఇటు తన పొగానీకూడా మరిచి....మరిచీ మైమరచి నిలబడిపోయింది!" అంటూ గట్టిగా నవ్వింది.

"నీ పని చెప్తానుండు" అంటూ లవంగి లేచింది.

చెలికత్తె యింకొంచెం దూరంగా నడిచి పరుగు చేయడానికి సిద్ధంగా ఉంది "అదిగో, నీ కోపంలో క్రౌర్యం లేదు! నీ నడకలో వేగం లేదు—అది హంసనడక అయిపోయింది. పురివిప్పిన నెమిలి తోకలాగా నీ వేణీబంధం మాటున నీ ప్రియుని ఆచూకీ దాచాలని చూస్తున్నావు....అవునా రాకుమారీ....అంతే కదూ?" అంటూ నవ్వింది.

"ఏమిటి నీ మాటలు" అంటూ బయటికి పరుగెత్తిన ప్రియసఖిని వెంట తరుముతూ లవంగి పరుగెత్తింది.

## 6

గురుకులంలో తోటలో తచ్చాడు తున్నాడు జగన్నాధుడు. వెంట వెంట తిరుగుతున్నాడు బలరాముడు. జగన్నాధుని మనస్సు పరిపరి విధాల పోతూంది. తన చేతిని పదేపదే చూసుకుంటున్నాడు. ఇదే చూస్తున్న బలరాముడు 'ఎన్నిసార్లు చూస్తావాచేతిలోని రేఖలు?' అన్నాడు.

ఉలిక్కిపడి పచారు ఆపాడు జగన్నాధుడు. 'ఏమిటి బలరామా, నువ్వన్నది?'

"మరేమిటయ్యా ఆచేతినలా చూసుకుని మురిసిపోతున్నావు" రాకుమారి చేయి యింకా నీ పిడికిట ఇమిడి వుందను కుంటు న్నావా?....వెర్రివాడా, అడవారూ, పాదరసం ఒకటేనయ్యా మురి పించి చేయిజారిపోతారు." అన్నాడు స్పష్టంగా.

జగన్నాధుడు బలరాముని దగ్గిరకి వచ్చాడేగాని, చెప్పదలచినది చెప్పాలా? వద్దా అని సందిగ్ధంలో పడ్డాడు.

"చెప్పవయ్యా. కనీసం నాకు చెప్పుకుంటేనైనా నీ హృదయంలో

*With Best Compliments From :*

**Vijaya Scientific Equipments**

COMPLETE LABORATORY FURNISHERS

*Sole Agents For*

**MEOPTA MICROSCOPES AND ACCESSORIES IN INDIA**

*AND*

'GANSONS' Gasplants and other laboratory equipments
'OLYMPUS' Microscopes all types
'KEROY' Brand balances in A. P.

5-9-236 ABID ROAD
HYDERABAD-1
Phone: 52829
Grams: **Microscope**

P. B. No. 333
Congress Office Road
VIJAYAWADA-2
Phone: 3665
Grams: **Equipments**

భారం తీరుతుంది.''

''బలరామా, తిరిగామెను కలుసుకోవడం సంభవమే నంటావా?''

''ఎందుకు నాయనా, ఆమెగారు రాజుగారి కూతురు. రాజుగారు తలుచుకుంటే మనకి దెబ్బలకి కొదవ వుండదు!'' అంటూ తన వీపు తడుముకున్నాడు బలరాముడు.

''మనపై ఫిర్యాదు చేస్తుందని నేను అనుకోను బలరామా. నా కలా అనిపించడంలేదు'' నెమ్మదిగా అన్నాడు జగన్నాధుడు.

''మరి మనం ఆమెని అవమానించాం కదా?'' అనుమానంగా అడిగాడు బలరాముడు.

''మనం ఏం అవమానించాం? అవమానించలేదు. బలరామా, లవంగీ రాకుమారి ఆ పురుషదుస్తులలో కూడా ఎంత అందంగా శోభిస్తూంది! నిజమైన సహజ సౌందర్యరాశి కదా ఆమె'' సగం స్వగతంగా అన్నాడు.

''నీ కెలా తెలిసిందీ? ఓ క్షణం కూడా నీ వామెని చూడలేదే?'' అనుమానంగా అడిగాడు బలరాముడు. జగన్నాధుడు తన చెలికాని భుజం గట్టిగా తట్టి ''నువ్వొట్టి వెర్రివాడివి బలరామా''అన్నాడు. అన్నం అంతా వుడికిందో లేదో తెలుసుకుందుకు ఒక్క మెతుకు పట్టిచూస్తే చాలదా అన్న భావం అతని మాట తీరులో ద్యోతకమైంది.

దైవసాన్నిధ్యంలో లవంగి పండితరాయనివైపు చూస్తూ ఎలాగైతే చేష్టలుడిగి నిలబడి పోయిందో బలరాముడు కూడా అలాగే తన నెచ్చెలికాని చూస్తూ నిలబడిపోయాడు! జగన్నాధుడు నవ్వి బలరాముని ఒక్కతోపు తోశాడు. ''నువ్వలా చూస్తుంటే బాధ కల్గుతూంది.''

బలరాముడు భుజంపైనున్న అంగవస్త్రం తీసి ఒక్కదులుపు దులిపి బయటికి నడిచాడు.

అతని వెంటబడుతూ ''బలరామా, నేనూ నీ వెంటవస్తున్నాను. అలా గంగాతీరానికి వెళ్ళివద్దాం'' అంటూ బలరాముని కలుసుకుని అతగాని భుజంపై చెయ్యి వేసి నడువసాగాడు జగన్నాధుడు.

## 7

లవంగీ రాకుమారి చెలిని తరుముతూ గంగాతీరం చేరింది. చిరు వెన్నెలలు ప్రసరిస్తున్నాయి. ఆకాశంలో చెమ్కీలాగా నక్షత్రాలు అక్కడక్కడ మెరుస్తున్నాయి. జనసందోహపు చప్పుళ్లెక్కడా వినబడ్డంలేదు. శిబిరాలలాంటి ప్రశాంతమైన చోట వేయించాడు అసఫ్‌ఖాన్. చిన్నచిన్న నావలు రాకుమారి విహారార్థం తీరాన కట్టి ఉన్నాయి. చెలిని తరిమి తరిమి అలసిన లవంగి ఒక నావనెక్కి కూర్చుంది—అలసిన ఆమె, పరుగిడిన ఆయాసంతో ఆమె వక్షోజాలు యెగసి పడుతున్నాయి. తెరచాప కొయ్యకి తలానించి కన్నుళు


Grams : SANZYME

Phones Office : 38193
Factory : 48141
48077

*With best compliments from :*

**UNI-SANKYO LIMITED**

**The First Indo-Japanese Collaboration**

FOR

**Pharmaceuticals & Chemicals**

*Registered Office* :

Plot-37 Road No. 10

Banjara Hills

HYDERABAD-34.

ANDHRA PRADESH

*Admn. Office* :
Mahalaxmi Chambers
22, Bhulabhai Desai Road,
BOMBAY-26

*Factory* :
Gaganpahad,
Mahboobnagar Road,
HYDERABAD-WEST

మూపింది. చెలికత్తె "వన్ను పట్టుకోనే లేకపోయావు. ఓటమిని అంగీకరించినట్టేనా?" అని వేళాకోళం చేస్తూ వచ్చి లవంగి పక్కన కూర్చుంది. "నా మనసెందుకింత నిలవడంలేదు? దేనికోసం ఈ తహతహ?" సగం స్వగతంగా అడిగింది లవంగి.

"నే చెప్పనా?" కుతూహలంగా అడిగింది చెలి.

"ఒద్దు. చెప్పకు. నాకు తెలుసు—మనస్సు ఎదురుచూచేది ఎవరి కోసమో. ఆ కోరిక తీరుతుందా అన్నదే అనుమానం!" అంది

"గట్టిగా కోరుకుంటే యే కోరికేనా తీరుతుంది రాకుమారీ" హెచ్చరించింది చెలి.

"అలాగా?" ఆగింది లవంగి. ఆమె కర్ణపుటాలకి లీలగా దూరంలోంచి ఏదో విన్పించినట్టయింది. చెవియొగ్గి వినసాగింది. ఆమె ముఖం వికసించింది. కళ్ళు మిలమిల మెరిశాయి. "చెలీ నీవన్నది నిజమేనే. నీ వన్నది నిజం" అంటూ చెలికత్తెని కౌగిలించుకుంది లవంగి.

గంగాతీరాన గంభీర కంఠంతో శ్లోకాలు పఠిస్తూ బలరాముడు కూడా నడుస్తూంటే—యీ లోకంతో ఏమీ సంబంధంలేని అతీత వ్యక్తిలాగా నడుస్తూన్నాడు జగన్నాధుడు.


లవంగికి దూరం నుంచి వినిపించిన కంఠస్వరం చేరువవుతూ వస్తున్నట్టు అనిపించింది. ఆమె హృదయంలో సందడి ఎక్కువైంది. "అదే—అది అది అతగాని కంఠస్వరమే" వనుకున్నప్పుడల్లా మేను పులకరించింది. చెలికత్తె పడవ తాడు విప్పి నావని ప్రవాహంవైపు మళ్ళించింది. తెడ్డు వేయడం ప్రారంభించింది. ఇది గ్రహించిన లవంగి "ఆపు చెలీ, అలా యెక్కడికే పడవని దూరంగా తీసుకుపోతున్నావు? ఆపు" అంటూ ప్రాధేయపడింది. "ఓపికపట్టిచూడు రాకుమారీ" అంటూ కంఠస్వరం వినవస్తున్న వైపునకు తరలించింది పడవ. పడవ చేరువకాను జగన్నాధుని కంఠం మరీ స్పష్టంగా గంభీరంగా వినిపించసాగింది లవంగికి. మైమరచి తెరచాప కొయ్యకి తల ఆన్చి వినసాగింది లవంగి.

పడవని తీరానికి మళ్ళించి నిలబెట్టింది చెలి. అక్కడే పది గజాల దూరంలోంచి నడుస్తూ వస్తున్నట్టు కనిపించారు జగన్నాధుడు. బలరాముడు.

తీరాన పడవ ఆగడం గమనించిన బలరాముడు "జగన్నాధా చూడు అటు" అంటూ పడవ చూపించాడు,

నడుస్తున్నవాడు చటుక్కున ఆగాడు జగన్నాధుడు. అతని కంటికి పడవ, చెలికత్తె, గంగ ఏమీ కనిపించడంలేదు. కనుమూపి తన్మయత్వంలో మునిగిన రాకుమార్తె ఒక్కతే కన్పిస్తూంది. శీఘ్రంగా పడవకి చేరువై అంచున నిలచి 'రాకుమారీ' అంటూ అప్రయత్నంగానే చేతులు రెండూ చాచాడు. అతని మనస్సు రాకుమారీ దర్శ



నంలో పరవశించి పోయింది. ఎదురు చూడని ఈ అవకాశంలో. ప్రేమావేశంతో అతని కంఠం బొంగురు పోయింది.

చాచిన అతని చేతులను తన చేతుల్లోకి తీసుకుంది రాకుమారి. 'మీరా?' అంటూ. అతని చేయి ఆధారం చేసుకొని పడవనుంచి క్రిందికి దిగింది. 'అది మీ కంఠస్వరమే అని నా మనస్సు పదేపదే చెప్పినా, కాదేమోనని భయంవేసింది. కళ్లు తెరిస్తే కల చెరిగి పోతుందేమోనని భయంవేసింది." అంది వినీవినపడనంత నెమ్మదిగా.

పడవని కట్టడానికి తాపత్రయ పడుతున్న చెలికత్తెకి చేయూత నిస్తూన్నాడు—బలరాముడు.

గంగవడ్డున జగన్నాధుడూ లవంగీ కూర్చున్నారు. చిరుగాలికి కదలాడుతున్న గంగాజలంలో వారి పాదాలు తడుస్తున్నాయి.

ఎంత చూపినా తనివితీరని రాకుమారి ముఖంలోకి సానునయంగా అవలోకిస్తూ "లవంగీ రాకుమారీ, ఈ పిరికిమానవుడు క్షంతవ్యుడు సుమా. మంది మాటలను కాదనరాదని గురువుల ఆజ్ఞ.' అని దేవాలయంలో తన ప్రవర్తనకి వివరణ చెప్పుకొన్నాడు జగన్నాధుడు. లవంగి ముఖంనుంచి చూపు మరలించుకోలేక పోయాడు. "ఇన్నాళ్ళ యీ వసంతం ఎలా దాగొనకల్గింది?....నా హృదయంలోని అలజడి నీకు వినబడడం లేదా రాకుమారీ?" ప్రాణభిక్ష పెట్టమని వేడుకుంటున్నంత బాధగా అడిగాడు.

బదులు చెప్పకుండానే జగన్నాధుని చేయి తన చేతిలోకి తీసుకుంది లవంగి. "మీరు చేసిన పనిలో కొంచెంకూడా తప్పులేదు. బహూశా మీరింకోలా ప్రవర్తించివుంటే మన ఈ కలయిక సంభవమే అయేది కాదు కదా?" అని తల వంచింది. చుబుకంపై చేయివేసి ముఖం పైకెత్తాడు జగన్నాధుడు. సువిశాలమైన ఆమె నేత్రాలు వెన్నెలలో మీనుల్లాగా మిలమిల లాడుతూన్నాయి. లోతు తెలియని కళ్లు ఆమె చెప్పలేని మనస్సువిప్పి చెప్తున్నాయి. "ఈ క్షణంలో


Telephone { Regd. Office : 82716
Factory : 45

Telegrams : "SARVARAYA"
Ramachandrapuram

*With Best Compliments and Good Wishes from :*

**SRI SARVARAYA SUGARS LTD.**

*Factory :*
CHELLURU
Ramachandrapuram Taluq
East Godavari District
*ANDHRA PRADESH.*

*Regd. Office :*
38, Whites Road
Royapettah
MADRAS-14.

*Manufacturers of :*

The Best Quality Crystal White Sugar
Industrial Alcohol
Gold Spot soft drinks

కదా నే పోగొట్టుకున్న వసంతాల విలువ తెలుస్తూంది" అంది అతి నెమ్మదిగా లవంగి.

"నాకీ గంగాతీరం, యీ వెన్నెల అన్నీ పాతవే. అయినా నీ ఉనికిలో వాటికి కొత్త హుందాతనం వచ్చినట్టుంది. రేపీ సమయంలో యిక్కడికే యీ పిచ్చివాడు రావచ్చునా రాకుమారీ?" ఆశగా అడిగాడు జగన్నాధుడు.

గలగల మాట్లాడుతూ బలరాముడూ చెలీరావడం గమనించింది లవంగి. త్వరపడి లేస్తూ వినీ వినిపించనంత నెమ్మదిగా "అలాగే నేనూ వస్తాను. ఇక సెలవా! తనూ లేచి నిలబడుతూ "మానినీ మణివి. మాట తప్పవుకదూ?" ఆత్రంగా అడిగాడు జగన్నాధుడు. "మాట తప్పి నేనుమటుకు మనగలనా?" అంటూ పడవవైపు నడచింది లవంగి.

పడవ సాగిపోయేదాకా అలాగే నిలబడి చూస్తూవున్నాడు జగన్నాధుడు.

## 8

ఊహల యవనికల మాటునుంచి నయనానందకరంగా ఒకరినొకరు చూసుకుంటూ, ప్రేమికుల మనస్సుకు ప్రశాంతి కూర్చే చిరుకబుర్లు చెప్పుకుంటూ ప్రతి సాయం సమయం "తిరిగి రేపీ ప్రాంతాల వేచివుంటా" మని చెప్పుకొంటూ కాలం గడిపారు లవంగి జగన్నాధులు. వారికి సూర్యోదయం కావడం—సూర్యాస్తమయం కావడంకోసం ఎదురుచూడ్డమే అయిపోయింది.

నాల్గు రోజులు గడిచాయి. గంగానదీతీరాన సువిశాలమూ సుందరమూ అయిన ఇంకో గుడారం తలెత్తింది. షాజహాన్ చక్రవర్తి ముంతాజ్‌తో సహా దానిలో విడిదిచేశాడు.

ఈ కుటీరానికి కొలది దూరంలో ఎన్నో గుడారాలు లేచాయి. సైన్యంతో ఆప్రాంతమంతా చాలా కోలాహలంగా ఉంది.

గుడారంలోపల షాజహాన్ చక్రవర్తి ఆసీనుడై ఉన్నాడు. అసఫ్ ఖాన్ షాజహాన్‌కి వివరాలన్నీ విశదీకరిస్తున్నాడు. "తమరే వేంచేయవలసిన అగత్యంలేదు ప్రభూ. రేపీపాటికంతా సద్దుమణిగిపోతుందనే నా అభిప్రాయం. లవంగీకుమారిమటుకు తొందరపడుతున్నది. దైవదర్శనంకోసం" సవినయంగా విన్నవించాడు.

పక్కనే ఆశీనురాలై ఉన్న ముంతాజ్ "ఏదీ నా బిడ్డ. నేవచ్చినది తెలిసీ యింకా రాలేదేం?" అడిగింది.

షాజహాన్ చిరునవ్వు ప్రసరిస్తూ "బేగంసాహెబా కాశీదర్శన భాగ్యం కావాలని యిప్పుడిలా బిడ్డకోసం పరితపిస్తావెందుకు?" కుతూహలంగా అడిగాడు.

"మీకు స్త్రీ హృదయం తెలీదు జహాపనా. లేకుంటే ఇలా అడిగేవారా?" సాదరంగా భర్తని చూస్తూ అంది ముంతాజ్.



*TEACH YOUR CHILD*

**TO SAVE MONEY FROM NOW**

...and who knows what big things he may go on to later in life! But only you can help him, by opening a special minors savings account for him, which you or a guardian can operate on his behalf. Children over 14 can operate their own accounts.

***Why not start 'Operation Savings' to-day?***

**STATE BANK OF HYDERABAD**




లవంగి కన్నెకోసం పరుగెత్తిన దాసీవచ్చి "రాకుమారి వర్మశార్థం వెళ్ళినట్టుంది మహారాజ్ఞీ" సవినయంగా సెలవిచ్చింది.

"కూడదని తెలియదా రాకుమారికి" హుంకరించాడు షాజహాన్. "అసఫ్‌ఖాన్, మీరు వెళ్ళి చూడండి" అంటూ లేచి డేరా అంత ర్భాగంలోకి చెకచెక వెళ్ళిపోయాడు.

ముంతాజ్ మటుకు కదలక కూర్చునేవుంది. ఓ క్షణం తరువాత లేచి వెళ్ళి "మీరెందుకంత ఆవేశపడతారు? బిడ్డ గంగానదీ తీరానికి పోయివుంటుంది. దేవాలయంలోకి మన వెంటనే తీసుకువెడదాం" అంటూ సుముఖుని చేయ ప్రయత్నించింది.

ముంతాజ్ ఊహించింది అక్షరాలా నిజమే. లవంగి జగన్నాధులు గంగాతీరంలో ఓ పడవ నానుకుని కూర్చుని—ఈ లోకాన్నే మరిచారు!

లవంగి రాకుమారి గొంతు కొత్తచిగుళ్ళు దొడిగి సుళ్ళు తిరుగుతూ ఊహాలోకాల్లో విహరిస్తున్న శరీరంలేని మనస్సులాగా రాగాలాపన చేస్తూంది. జగన్నాధుని కంఠం జత కలిసి పాడుతూంది. ఆ గాన మాధుర్యంతో గంగాతీరమంతా ప్రశాంతం అయి చెవులు రిక్కించింది.

"కన్నెపిల్ల అంత ధైర్యం చేయడం బాగుందా?" అంటూ విసుక్కుంటున్నాడు షాజహాన్.

"లవంగి ఆజ్ఞలుమీరే పిల్లకాదు ప్రభూ, మీ రనవసరంగా ఆవేశ పడుతున్నారు" అంటూ సర్దిచెప్తూన్న ముంతాజ్‌కు దూరతీరాలనుంచి తేలివస్తూన్న పాట విన్పించింది. "ఎవరో ప్రేమైకజీవులు. ఎంత తియ్యగా పాడుకుంటున్నారో విన్నారా, జహాపనా?" కుతూహలంగా అడిగింది.

ముంతాజ్ వెనుకనే నిలబడి—కిటికీలోంచి కనబడుతున్న గంగా తీరాన్ని చూశాడు షాజహాన్. అతని కంటికెవరూ కనబడలేదు. గానంమటుకతని కర్ణపుటాలకి విందుచేస్తూంది. "మనకంటే ప్రేమైకజీవు లీ భువిలో ఉంటారా బీగమ్?" అంటూ ముంతాజ్

With Compliments From:

**VELJAN HYDRAIR PRIVATE LIMITED**

**BALANAGAR, HYDERABAD-37**

**Grams:** INDVEL

**Phone: 39423**

***Manufacturers of:***

**Air & Hydraulic Equipment**

చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు షాజహాన్. ఉండండి అన్నట్టు తలూపి దర్వాజాకేసి నడిచింది ముంతాజ్. "ఎవరక్కడ?" అని కేకవేస్తూ.

ఆదరాబాదరాగా ఓ భటుడు వచ్చాడు. "గంగాతీరంనుంచి విన వస్తూన్న ఆ గానంచేసేది ఎవరైనా సరే మా ముందుకి హాజరు పెట్టమని చెప్పు" అని ఆజ్ఞాపించాడు భటుని చూపిన షాజహాన్ చక్రవర్తి.

"చిత్తంప్రభూ" అంటూ నిష్క్రమించాడు భటుడు.

భటుడు కదిలి అలా వెళ్ళాడో లేదో గానరవళి ఆగిపోయింది. షాజహాన్ ముంతాజ్‌లు ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని చిరునవ్వు నవ్వుకున్నారు.

గంగాతీరం చూస్తుండగా చీకటిలో కలిసిపోయింది. సన్నని వెన్నెల పడి గంగ మెరుస్తూ జరీ దారాల్లాగా కదలుతూంది. ముసుకుంటున్న చీకటుల నడుమ లవంగి చిరుమెరుపులాగా కన్పిస్తూంది. "నే నిక వెడతాను స్వామీ....వెళ్ళిరానా?" అనురాగం నిండిన స్వరంతో అడిగింది లవంగి.

"అప్పుడేనా. ఇంకా సూర్యుడు పూర్తిగా అస్తమించనైనాలేదే" లవంగి చేతిని అందుకుంటూ జగన్నాధుడు అడిగాడు.

"సూర్యుడు అస్తమించి చాలావ్యవధి దాటింది స్వామీ! మీ రింకా ఇక్కడే వుండడంవల్ల కాబోలు యీ ప్రదేశంలో చీకటి తెలియడం లేదు!" సన్నగా నవ్వింది. "అలాగా ఇంతటి అందకత్తెవి, కవిత్వం కూడా చెప్తే మా బోటి వారి కింకెక్కడుంటుంది చోటు?" వేళాకోళం చేశాడు జగన్నాధుడు.

"ఎంతటి వారమైనా మేం మీ అంతటి వారం కాలేము కదా? మీకు ఢిల్లీ దర్బారులు. మాకు మీ హృదయపు దర్బారులే కదా కవితా గానం వినిపించగల్గిన స్థావరాలు. ఔనా?"

"నీ వన్నది కాదనడాని కీధీరుడు ఎంతటివాడు రాకుమారీ. మళ్ళీ ఎప్పుడు?" లవంగిని తన కౌగిట పొదువుకుంటూ అడిగాడు.

"ఢిల్లీనుంచి చక్రవర్తి వేంచేశారు. వారితో మా అమ్మగారు కూడా వచ్చారు. నే నింకా వారి దర్శనానికి కూడా పోలేదు. ఈ బానిస జీవితానికి సిగ్గుపడుతున్నాను. స్వేచ్ఛలభ్యమైన నాడు మీ చెంతకు రాకుండా వుండగలనా?"

"నీవు వచ్చేవరకూ ఈ ప్రాంతాలనే ఉంటాను ప్రేయసీ. కనిపించక వెడలిపోతే నిన్ను వెన్నంటి ఢిల్లీ వస్తానుగాని మానను" ప్రేయసిని ఒక్కసారి కసితీరా కౌగిలించుకుని వదిలాడు జగన్నాధుడు. వెనుక చూపులు చూస్తూ, చాటున నిలచిన తన చెలి దారి చూపగా తన కుటీరం కేసి ప్రయాణం అయింది లవంగి.

ఉస్సురని లేచి గంగ ఒడ్డునే నడవడం ప్రారంభించాడు జగన్నాధుడు—తన గురుకులం వైపు.


*With best compliments from:*

CROWN CASTINGS PRIVATE LIMITED

*Manufacturers of:*

**Meehanite Metal Castings**

**B-49/1 & 2, INDUSTRIAL ESTATE, SANATH NAGAR**
**HYDERABAD-18.**



అప్పటికే చీకటి పూర్తిగా ఆవరించింది. కాగడాలు పట్టుకుని రాజభటులు గంగాతీరం గాలిస్తున్నారు—ఆ పాట పాడిన వ్యక్తుల కోసం. కాని వారి కెక్కడా ఎవరూ కన్పించలేదు. గంభీరస్వరంలో భగవన్నామ పారాయణ చేస్తూ తలవంచుకు గంగ ఒడ్డంటే నడుస్తున్న జగన్నాథుడు వారి దృష్టిని ఆకట్టలేదు. ఈ పుణ్యపట్టణంలో భగవధ్యానాన్ని ఎందరెందరు చేయరు? అనుకున్నారు. వెతికినా ప్రయోజనంలేదని భటులు తిరిగి వెళ్ళిపోయారు.

అప్పటికే లవంగి తన గుడారం చేరింది. తల్లిగారు తనకోసం ఎదురు చూశారని వింది. త్వరత్వరగా ముస్తాబై ఫలాల నొక సజ్జలో పెట్టుకుని చక్రవర్తులు బసచేసిన డేరాలో ప్రవేశించింది. లవంగి ఎంతో ఉత్సాహంగా వుంది.

ముంతాజ్‌ని చూడగానే 'అమ్మా' అంటూ పక్క మేజాపై పళ్ళు పెట్టి, కౌగిలించుకుంది. లవంగి భుజాలు పట్టి దూరంగా జరుపుతూ "ఇప్పుడా నన్ను చూడరావడం?" కోపం నటించ బోయింది. ఇంతలో వెతక వెళ్ళిన భటులు తిరిగి వచ్చినట్టు వర్తమానం చెప్పడానికో సేవకుడు రావడంతో "ఏమైంది?" అంటూ అడిగింది.

"అక్కడెవరూ కానరాలేదట మహారాణీ," అని సెలవిచ్చారు.

చక్రవర్తి షాజహాన్ బయటికివస్తూ "నువ్వు వెళ్ళు" అని సేవకుని పంపించాడు. ముంతాజ్‌కేసి నవ్వు ముఖంతో చూస్తు 'అయితే బేగమ్, నువ్వు చెప్పినట్టు ఆ జీవులు పూర్తిగా ప్రేమైక జీవులు కారని తోస్తుంది. ఒకరిలో ఒకరు జీవించేవారికి ఇల్లూ వాకిలీ జ్ఞాపకానికి వస్తాయా ముంతాజ్!"

లవంగి తల నిమురుతూ నిలబడింది ముంతాజ్. లవంగి చెంపలు కెంపులలాగా ఎరుపెక్కాయి. "మీకు ఓరిమి తక్కువ జహాపనా! లేకుంటే తక్షణం ప్రేమికులని పట్టుకురండని సైనికులని పంపుతారా?" అని నవ్వింది ముంతాజ్.

లవంగి కిదంతా అర్థమయింది. కాని అర్థమూ కాలేదు, తల్లి తండ్రుల ముఖాలలోకి చూసింది. "మీరు విశ్రమించండి అమ్మా

*With Best Compliments From :*

## Shree Sreenivasa Welding Works

**AMIRPET, HYDERABAD-16.** **Phone : 38112**

***Manufacturers :*** **GATES, GRILLS, PIPECOTS, STEEL-WINDOWS & WATER HEADTANKS, Etc.,**

**OUR SPECIALITY IN MANUFACTURE OF TRANSFORMER TANKS**

జాన్. నేను ఉదయం వస్తాను.'' అంటూ అక్కడినుంచి త్వరగా వెళ్ళి పోయింది లవంగి.

''జహాపనా! లవంగి కొంచెం చిక్కింది కదూ.'' అడిగింది ముంతాజ్.

''లేదు. ఎందుకో చాలా వుత్సాహంతో ఉన్నట్టుంది నాకు. కారణం ఏమై ఉంటుందో.'' అంటూ కిటికీవైపు నడిచాడు. ''ఈ గంగ అందం చీకటిలో ఇనుమడించింది బేగమ్.'' అంటూ భార్యని ఆహ్వానించాడు.

ముంతాజ్ కూడా అటువెళ్ళి భర్త ప్రక్కనే నిలబడింది. అనునయంగా ఆమె భుజంపై చేయివేశాడు షాజహాన్. ''ఓ క్షణం క్రిందట అక్కడ ఉండి ఈ లోకమే లేనట్టు పాటపాడిన ఆ ప్రేమికులు ఏమై ఉంటారు? ఎవరై ఉంటారు?'' సగం స్వగతంగా అన్నాడు షాజహాను.

నవ్వుతూ భర్తనడుము వెనుక తన చేయివేసి ''మీ పిచ్చిగాని కాగడాల వెల్గులో మేం ప్రేమికులం ఇక్కడున్నామని ఎదురొస్తారా జహాపనా?'' వేళాకోళం చేసింది ముంతాజ్.

ఆనందంతో గట్టిగా నవ్వేశాడు షాజహాన్. ''నిజమే. నాకు తోచలేదు సుమా'' అని భార్య ముఖంలోకి చూశాడు. ముంతాజ్ గాఢానురాగంతో షాజహాన్ హృదయంపై తల వాల్చింది.

# 9

త్వరితగతిని జగన్నాధుడు బయటికి వెళ్ళడానికి సిద్ధం అవుతుండటం గురుదేవులు గమనించారు. అతని చెంతకు వచ్చి భుజం తడుతూ, ''నాయనా, జగన్నాధా. నీవేదో మనస్సులో మధనపడుతున్నట్టుంది.'' కుశలప్రశ్నగా వేశారు. ఆలోచనలు ఎక్కడెక్కడో ఉన్న జగన్నాధుడు గురుదేవుల కంఠస్వరం విని అదరిపడ్డాడు. ''ఏమీలేదు గురుదేవా, ఏమి వుంటుంది మధనపడ్డానికి?'' అన్నాడు.

తనకంతా తెలుసునన్నట్టు చిరునవ్వు నవ్వారు శేష వీరేశ్వరులు. ''కొంచెం నిదానం ప్రధానం నాయనా, ఆలోచించి అడుగువేయడం అలవరచుకో. బలరామా, నీ సఖుని ఓ కంట కనిపెట్టుకు తిరగవయ్యా'' అని బలరాముని హెచ్చరించారు.

గురువుగారు లోపలికి వెళ్ళనిచ్చి ఆత్రంగా బయటికి నడిచాడు జగన్నాధుడు. అతని వెనకనే బలరాముడు నడిచాడు. ''జగన్నాధా ఏమిటా తొందర? నీతో నడవలేకుండా వున్నాను'' అంటూ అరిచాడు—రొప్పుకుంటూ.

జగన్నాధుడు ఆగి నవ్వుతూ, ''లేకుంటే నువ్వెందుకయ్యా పానకంలో పుడకలాగ! హాయిగా పోయి'' జగన్నాధుని మాట పూర్తి కాకుండానే ''ఆగు ఆగు. గురువులమాట విన్నావు కదా—పద''


*Interested in your security through savings....*

**Andhra Bank**

**PAYS YOU HANDSOME INTEREST**

**with Tax benefits**

**Savings Bank, Recurring Deposits,**

**Fixed Deposits, Minors' Savings...**

**Andhra Bank has so many attractive Saving Schemes—**

**Whatever your Age or Vocation.**

**To make your future safer, and earnings handsome—**

**with tax benefits.**

**Save for the future, make your money grow**

**with...**

THE ANDHRA BANK LTD.

*Central Office :*

**SULTAN BAZAAR, HYDERABAD.**

M. V. SUBBA RAO
*General Manager*

K. GOPAL RAO
*Chairman*

*A NON-NATIONALISED BANK IN THE NATION'S SERVICE*

అంటూ జగన్నాధుని చేయిపట్టుకుని నడవడం ప్రారంభించాడు.

ఇద్దరూ లోకాభిరామాయణం చర్చిస్తూ గంగాతీరం చేరుకున్నారు. నీటి అంచుదాకా నడచి ఒక పడవకి జేరబడి కూర్చున్నాడు జగన్నాధుడు. పక్కనే కూలబడ్డాడు బలరాముడు. ''ఇక్కడేనా తమరు ఎప్పుడూ విశ్రమించేది.'' అడిగాడు.

''అవును బలరామా'' అంటూ గొంతు సవరించి శ్లోకాలు చదవడం ప్రారంభించాడు.

ఆ ప్రశాంత వాతావరణంలో జగన్నాధుని కంఠస్వరం సరస గంభీరంగా గాలిలో తేలిపోయి విశ్వవ్యాప్తం అవుతూంది....ఓ పది నిముషాలుకూడా గడవకముందే బలరాముడు హాయిగా పైబట్ట నేల మీద పరిచి నిద్రకు ఉపక్రమించాడు.

బాగా చీకటి పడిపోయింది. జగన్నాధునికి లవంగి వస్తున్న జాడకూడా తెలియరాలేదు. ఆత్రుతతో ఆమె వచ్చే దిశవైపే చూస్తూ కూర్చున్నాడు జగన్నాధుడు.

కూర్చున్నవాడు లేచి తీరంవెంట నడుస్తూ పడవేదేనా వస్తున్న జాడ కన్పిస్తుందేమోనని వెతుకాడసాగాడు. అతనిలో నిరుత్సాహం తలెత్తడం ప్రారంభించింది. లవంగి ఎందుకు రాలేదు? అటూ ఇటూ కాలుకాలిన పిల్లిలాగా తిరుగుతూ—లవంగి ఎందుకు రాలేదు? అని ఒకటికి పదిసార్లు ప్రశ్నించుకోసాగాడు. 'నేనామెను చూసి తీరాలి. లేకుంటే ఇక క్షణంకూడా నిలవలేను'' అనుకొని తీరంనుండి గుడారాలు లేచిన ప్రదేశంవైపు నడవడం ప్రారంభించాడు జగన్నాధుడు. అతని గుండెలు ఆత్రుతతో త్వరితగతిలో కొట్టుకుంటున్నాయి.

దూరంలో కాశీపట్నం వింత సొబగులు పోతూంది. మేలిముసుగు ధరించినట్టున్న చీకట్లలో దీపాలు వింత వెల్గుతో ప్రకాశిస్తున్నాయి. జగన్నాధుని మనస్సు శూన్యం అయింది. లవంగి రాకుమార్తె గుడారపు జాడ కూడా లేదు. ఆ ప్రదేశంలో. దేరాలు పీకిన ఆనవాళ్లు మాత్రమే ఉన్నాయి చలనం లేక నిలబడి పోయాడు జగన్నాధుడు. లవంగి ఏమైపోయింది? అంత వీడ్కోలు కూడా చెప్పకుండా వెళ్ళి పోతుందా? అసంభవం అంటూంది అతని మనస్సు.

కాని అతని మనస్సుకు తెలియనిది తెలిపినా నమ్మనిదే జరిగింది.

లవంగి తన పరిజనులతో ప్రయాణం సాగిస్తూంది. మేనాలో కూర్చున్న ఆమె హృదయం జగన్నాధునికోసం వెతుకుతూనే ఉంది. ఆమె కన్నులు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. చెలి ఆమెను ఓదార్చాలని చూస్తున్నకొద్దీ ఆమె దుఃఖం ఎక్కువ అవుతూంది.

''రాకుమారీ, యిలా బేలవైతే ఎలా? నీ ప్రియతముడు నీకై ఢిల్లీకైనా రాక మానడు నా మాట నమ్ము'' అని బ్రతిమాలుతూంది.

''ఆ గంగాతీరంలో నాకై వేచిన స్వామికిలా నేను పరారీ


*Deepavali Greetings*
*to all our Valued Customers & Well Wishers*

GOLDEN PRESS

**GOWLIGUDA, HYDERABAD Phone: 44338**

*Specialists in*

**Carton Printing, Box making, Varnishing**

**Quality Competitive Promptness**

అయిపోతున్నానని ఎలా తెలుస్తుంది? అపోహపడరా'' దుఃఖంతో లవంగి కంఠస్వరం గద్గదమైపోయింది. రెండు చేతులతో ముఖం దాచుకుని దుఃఖించసాగింది.

చెలికత్తె ఆమెను అక్కున చేర్చుకొని ఓదారుస్తూ ''పిచ్చిదానా నువ్వు రాకుమార్తెవు. నీకు అడ్డంకులు ఎక్కువ అని ఆ మహా మేధావి వూహించి ఉండరనా నీబాధ? నామాట నమ్మ. తప్పక ఢిల్లీ నగరం పావనం చేస్తారాయన.'' అని ధైర్యం చెప్పింది.

లవంగి, రాజకుమార్తె పరివారం ఆ సాయంసమయంలో ఢిల్లీ తిరుగుముఖంపట్టి కాశీ పొలిమేరలు దాటింది. పరివారం వెంట వెల్గుతున్న కాగడాలు గాలికి కదలుతూ నడుస్తున్న దీప శిఖల్లాగా ఉన్నాయి. బోయీల మోత ఆ చీకట్లను చీల్చుకుని వింతమృగపు మూల్గుల్లా విన్పిస్తూంది.

జగన్నాధుని కర్ణపుటాలకి ఆ బోయిల మూల్గులు లీలగా వినిపించాయి.

క్షణంపేపు స్తబ్దుడై అలాగే వింటూ నిలబడిపోయాడు. మరు క్షణం చైతన్యం పెంచుకొని ధీర గంభీర స్వరంతో జగన్నాధ స్వామి స్తోత్రపఠనం సాగిస్తూ తీరంవెంటనే నడక సాగించి— గురుకులంవైపు తిరిగాడు.

తిన్నగా తన వసతిలోకిపోయి తలుపు జేరవేసుకున్నాడు. కటిక నేలపై మేనువాల్చి కళ్ళకు చేయి అడ్డుపెట్టుకుని ఆలోచించ సాగాడు.

ఎంతకీ అతని ఆలోచనలకి ఒకదారి ఏర్పడలేదు. ఎంతకీ యిలా ఎందుకు జరిగిందన్న అతని ప్రశ్నకి జవాబు లభ్యంకాలేదు. దీర్ఘంగా నిట్టూర్చి ఒత్తిగిలి పడుకున్నాడు.

## 10

ఆగ్రా కోటలో లవంగి రాకుమార్తె అంతఃపురంలో హడావిడిగా వుంది. చుట్టూ చెలులు యెంత ముచ్చటలాడుతున్నా లవంగి గంభీరముద్ర దాల్చి నేల చూపులు చూస్తూ కూర్చుందేగాని వారి ఉత్సాహంలో పాలు పంచుకోవడం లేదు. పాల్గొనడమూ లేదు.

చాలా సేపటినుంచి ఈ వింత ప్రవర్తన తిలకిస్తున్న రోషనారా లవంగి చెంత కూర్చుని మునివేళ్ళతో ఆమె ముఖం పైకెత్తింది. ''లవంగి, ఈ కాశీ ప్రయాణం తరువాత నీలో కొత్త కాంతి వచ్చింది సుమీ' అంది. లవంగి తల్లిగారైన ముంతాజ్ వైపొకసారి చూపి కిమ్మనకుండా వూరుకుంది. ''అవును లవంగి, నీ కళ్ళు కొత్త కాంతు లీనుతున్నాయి. నీ ముఖంయిప్పుడే వికసించిన పూవులాగా నవనవ లాడుతూంది.''

''చాలు చాలు నీ వర్ణన. నాకు సిగ్గువేసేటంత పొగడకు బాబూ.'' అని వారించింది లవంగి.




FDS AG 1659 TEL A

"నిజమాడితే నిష్ఠూరమెందుకు బేటీ" అంది ముంతాజ్.

"అమ్మా జాన్, మీరు కూడానా" అంటూ బదులుకోసం చూడకుండా ఉద్యానవనంలోకి పరుగెత్తి పోయింది లవంగి.

ఆమె వెనుక అందరూ గట్టిగా నవ్వుతూంటే "అక్కడేదో జరిగే వుంటుంది ' అని స్వగతం పలుక్కుంది రోషనార.

జగన్నాధుడు సగం పిచ్చివాడై గంగాతీరంలో తిరిగి తిరిగి విసిగి వేసారిపోయాడు. అతగానికి లవంగి ధ్యాస తప్పించి వేరు ఆలోచనలేదు. ఎలాగైనా ఆమెను చూడాలి అన్న తపనే మినహా వేరు వ్యాపకంలేదు.

బలరాముని సలహాపై అతడు ఢిల్లీకి ప్రయాణమవడానికే తెగించాడు.

కాలం గడుస్తున్నకొద్దీ అతనిలో తెగింపు పెరిగిందేగాని తరగలేదు. ఒక శుభముహూర్తాన ఢిల్లీకి ప్రయాణం అయాడు.

ఢిల్లీ వెడదామన్న ఆత్రంతో అతనిలో కొత్త వుత్సాహం పుంజుకొంది. శరీరం ఆ ప్రాంతాల చేరకముందే—అతని మనస్సు లవంగి రాజకుమార్తె అంతఃపుర ప్రాంతాల నడయాడడం ప్రారంభించింది.

జగన్నాధుడు ఆగ్రా చేరుకున్నాడు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ప్రయాణం సాగించి తన ప్రేయసిని చూడాలన్న ఆశతో ఆగ్రా పట్టణం చేరుకున్నాడు. ఆగ్రా పొలిమేరలు చేరగానే అతనిలో ఆనందం పెల్లుబికింది. ఇంకేముంది! కొద్ది వ్యవధిలో తన హృదయాన్ని దోచుకున్న లవంగి రాకుమార్తెను చూడ్డమే కదా అనుకున్నాడు.

కాని పట్నమేలే రాజుండే ఊరులో ఒక కొత్తవ్యక్తికి అంత సులభంగా అంతఃపుర ప్రవేశం కల్గుతుందా అన్న ఆలోచనే రాలేదు అంతటి మేధావి అయిన జగన్నాధునికి. ప్రేమాతురులకు వివేకం శూన్యం కదా!

బలరాముడు వెంటరాగా పురవీధులు తిరుగుతున్నాడు జగన్నాధుడు.

ఆగ్రాకోట ప్రాంతాల రహదారులు తిరుగుతున్నారు. ఎక్కడ చూచినా పహరావాళ్ళు. ఎటుచూచినా గంభీరమైన కోట గోడలు.

కోట ముఖద్వారం ప్రాంతాల తచ్చాడుతున్న జగన్నాధుని, అతని చెలికాడు బలరాముని పహరావాళ్ళు నిలదీశారు. "ఎవరయ్యా. మహా జబర్దస్తీగా లోపలికి ప్రవేశించాలని చూస్తున్నారు? ఎవరిని చూడాలని?' హుంకరించారు.

"చూడవలసిన వాళ్ళనేలే!" అంటూ నవ్వుతూ జవాబిచ్చాడు బలరాముడు.

"మాటవరసకి?" రెట్టించాడు పహరావాడు.


దీపావళి శుభాకాంక్షలతో

## మద్రాస్ ఎనామిల్ వర్క్స్ లిమిటెడ్

65, సైడెన్‌హామ్స్ రోడ్డు,

మద్రాసు - 3.

శాశ్వతమైన విట్రియస్ ఎనామిల్ పబ్లిసిటీ సైన్‌బోర్డులు, ఎనామిల్డ్ హాస్పిటల్ వేర్స్, ఎనామిల్ గృహ పరికరములు, లేబొరేటరీ వేర్స్, ఎనామిల్‌తో కావలసిన మరి ఏ ఇతరవస్తు వయినా సరే—ఖాతాదారుల కోరిక ప్రకారం తయారుచేసి ఇవ్వగలము.

వివరములకు వ్రాయండి

గ్రామ్స్: "ఎనామిల్ సైన్" ఫోన్: 32346



"చక్రవర్తిని!" బదులుచెప్పాడు జగన్నాధుడు.

గట్టిగా నవ్వేస్తూ "అబ్బో చక్రవర్తినే. చూస్తావులే. ఏళ్ళతరబడి పడికాపులు పడిన వాళ్ళకే దిక్కులేదు!" అంటూ వెళ్ళిపోయాడు పహరావాడు. జబ్బపట్టుకుని బలరాముణ్ని ఓ పక్కకి నెట్టి ఒరీవెళ్ళిపోయాడు.

జగన్నాధునిలో నిరుత్సాహం ప్రవేశించింది. "రా బలరామా ఈనాటికి ఏదైనా బసచూసుకుని రేపు ప్రయత్నిద్దాం" అంటూ సాగిపోయాడు.

ప్రయాణీకుల సౌకర్యంకోసం ఎన్నో సత్రాలూ వసతులూ వున్న ఆ పట్నంలో జగన్నాధునికి విశ్రమించడానికి తావుకి కొదవలేదు బలరాముడు పొయ్యి రాజవేసి వంట ప్రారంభించాడు. జగన్నాధుడు ఆలోచనలో పడి అలా సమాధిలో కూర్చున్నట్టు కూర్చుండిపోయాడు.

అతని మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తూంది. లవంగికన్యనెలా చూడగలనా? అని మార్గాంతరాలు వెతుకుతోంది.

బలరాముని చేతిపాకం రుచియైనదే అయినా జగన్నాధునికి సౌక్యలేదు. ఏదో తిన్నాననిపించి లేచి నడవడం ప్రారంభించాడు.

రాత్రిపూట చీకటులను పారద్రోలుతున్నాయి ఆగ్రాపుర దీప తోరణాలు. నల్ల ముఖమల్‌పై చమ్‌కీ బిళ్ళల్లాగా మెరుస్తున్నాయి నక్షత్రాలు. రాత్రి గడుస్తున్నా రాస్తాలమీద నడుస్తున్న జనం తగ్గలేదు. ఈ మహానగరానికి రాత్రీ పగలూ తేడా తెలియదు అనుకుంటూ ప్రహరీగోడ ఎత్తునూ అనువునూ చూస్తూ నడక సాగించాడు జగన్నాధుడు....అలా తిరిగి తిరిగి అలసి తిరిగి బస చేరుకుని హాయిగా నిద్రకు ఉపక్రమించాడు. నిద్రకొరిగే ముందు సహజ గంభీరమైన తన కంఠంతో దైవప్రార్థన చేసే అలవాటుకూడా మరిచాడు జగన్నాధుడు.

బాగా పొద్దుపోయేదాకా తెలివే రాలేదు. బలరాముడు స్నానాదులు పూర్తిచేసుకొని స్నేహితుడు లేచేదాకా వేచివున్నాడు.

జగన్నాధుడింకా కళ్లు తెరవకుండానే రెండు అరిచేతులూ ఎత్తి కళ్ళకద్దుకుని దైవప్రార్థన చేసి లేచి కూర్చున్నాడు.

"ఏమిటిది జగన్నాధా. ఎన్నడూ లేనిదింత నిద్రేమిటి?"

"అలసిపోయాను బలరామా. ఆగ్రాపుర వీధులు తిరిగి తిరిగి అలసిపోయాను." నిరుత్సాహంగా బదులుచెప్పాడు జగన్నాధుడు.

"లే లే. త్వరగా స్నానాదులు ముగించు. వేడిగా భోజనం చేదువుగాని" అంటూ బలరాముడు తొందరపెట్టాడు. అన్యమనస్కంగానే కాలకృత్యాలు ముగించి, భోజనంకూడా ముగించి తిరిగి పడుకున్నాడు. స్నేహితుని మనసులో ఏముందో తెలిసిన బలరాముడు కూడా మాటలతో విసిగించక, తనూ నడుము వాల్చాడు.

బాగా చీకటులు నలుమూలలా అలుముకొనేదాకా జగన్నాధుడు బసలోనే యిటూ అటూ పచార్లు సాగించాడు. అతని ఆందోళనని అతడి చేతుల కదలికలే చెప్తున్నాయి.

రెండవ ఝాము వేళ బలరాముడు నిద్రలో పడ్డాడు. ఇదే అదనని జగన్నాధుడు తన కార్యక్రమానికి ఉపక్రమించాడు. బలమైన ఒక మోకు భుజాన వేసుకొని త్వరితగతిని కోటవైపుగా నడవడం ప్రారంభించాడు.

ఆగ్రా పురవీధులలో జనసంచారం బాగా సన్నగిల్లింది. మినుకు మినుకు మనే నక్షత్రాల వెల్గులు మినహా ఆట్టే వెల్గు లేదు.

కోట ప్రాంతాలకు చేరిన జగన్నాధుడు గోడల నీడలు పరచిన చీకట్లలో సాధ్యమైనంతవరకు దాక్కొని మోకు విసరడానికి అనువైన ప్రాంతంకోసం వెదుకసాగాడు ఒకచోట గురిచూసి కొసని పైకి విసిరాడు. పై కమ్ములకి తాడు తగులుకొంది. లాగి చూసి, ఆ తాడు సహాయంతో పైకి ఎగబ్రాకడం ప్రారంభించాడు జగన్నాధుడు. లోపలికి దిగాడు. రెండడుగులుకూడా వేయకుండానే "హారా హుషార్" కేక వినవచ్చి నీడలో నక్కి నిలచాడు. అలాగే కేకకీ బదులుకీ మధ్య నీడలలో దాక్కొంటూ కొంత నడిచాడు. కాని ఇద్దరు ముగ్గురు కాపలావారి కనుసన్నలు తప్పుకోలేక లోపలికే పరుగుపెట్టడం ప్రారంభించాడు. యోధులు వెంటపడి తరిమి పట్టుకున్నారు. "ఇదీ మంచిదే" నన్న తలంపుతో వారికి లొంగిపోయాడు.

"ఉదయాన్నే అసఫ్‌ఖాన్‌జీ ముందు హాజరు పెట్టవచ్చును—ఈ గుండెలు తీసిన బంటుని. అంతదాకా కారాగారంలో ఉంచండి" అన్నాడు అధికారి. ఆ రాత్రికి కారాగారంలో కటకటాల వెనుక కూర్చుని "లవంగిని చూసే అవకాశాని కిది నాంది" అని సంతోషించాడు జగన్నాధుడు.

* * *

ఉదయంపూట, అసఫ్‌ఖాన్ కొలువుదీరి విచారణలు జరిపిస్తున్నాడు....జనసమూహాన్ని హెచ్చరిస్తూ "పక్కకు తప్పుకోండంటూ కేకలువేస్తూ భటులు జగన్నాధుని కొలువు కూటానికి నడిపించుకు వచ్చారు. అతగాడు చేసిన దారుణానికి చేతులకూ కాళ్ళకూ కూడా గొలుసులు బిగించారు. జగన్నాధుడిదేమీ పట్టించుకోకుండా. ఉత్సాహంగా అడుగులు వేస్తున్నాడు. అమకోకుండా రాజదర్శనం యింత

త్వరగా లభించినందుకు జగన్నాధునికి ఆనందంగా వుంది.

"రాజ ప్రాసాదంలోకి భటుల కళ్ళు కప్పి ఈ వ్యక్తి దొంగ తనంగా ప్రవేశించాడు. బంధించి రాత్రికి కారాగారంలో ఉంచి తమ ముందు హాజరు పెడుతున్నాం" అంటూ అధికారి నేరారోపణ వివరించాడు.

అసఫ్‌ఖాన్ జగన్నాధుని పరిశీలనగా చూశాడు. నఖశిఖ పర్యంతం పరీక్షగా తిలకించి తల పంకిస్తూ "ఎవరు మీరు? మీపై మోపబడిన నేరం సత్యమేనా?" అని ప్రశ్నించాడు.

జగన్నాధుడు సహజగంభీరమైన తన కంఠస్వరంతో "అవును సత్యమే"నని హుందాగా బదులు చెప్పాడు. కాని ఈ పహరా వాళ్ళే విన్నటి సాయం సమయాన నన్ను నా సఖుని లోనికి పంపడానికి నిరాకరించారు. అందుచేత ఇట్లు చేయక తప్పింది కాదు" అన్నాడు.

"మీరలా ఎందుకు తొందరపడ్డారు?" అడిగాడు అసఫ్‌ఖాన్.

జగన్నాధుని ముఖంపై చిరునవ్వు వెల్గింది. "ప్రియురాలిని సందర్శించదలచిన యువకుని మనస్సు రాజుని చూడదలచిన కవితా కన్య పాదాలూ, సముద్రుని కలియ దలచిన జలాలూ నిశ్చలంగా ఎక్కడైనా ఉంటాయా? అడ్డుపెట్టినా ఆగుతాయా?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

అసఫ్‌ఖాన్ భటులను పై దొలగమని ఆజ్ఞాపించాడు. వారు జగన్నాధుని సంకెలలు తీసివేసి దూరంగా వెళ్ళారు. "భేష్ మీరు చక్రవర్తిని సందర్శింప కోరుతున్నారా?"

"అవును. మేం పండితులం. మా కవితాగాన మాధుర్యంతో చక్రవర్తిని మెప్పించాలనే కోర్కె కూడా లేకపోలేదు" నవ్వుతూ తన అభీష్టం తెలియచేశాడు జగన్నాధుడు.

"నేనా ఏర్పాట్లు తప్పక చేస్తాను. మీరెవరో తెలియక ఆ పొరపాటు జరిగింది, మీరు వెళ్ళిరండి" అని సెలవిచ్చాడు అసఫ్‌ఖాన్.

"సంతోషం. రేపు తిరిగి తమ దర్శనం చేసుకో కలను." అని సెలవు తీసుకొని నిష్క్రమించాడు జగన్నాధుడు.

జగన్నాధుడు అసఫ్‌ఖాన్ ముందు నిలబడి మాట్లాడడం లవంగి చెలికత్తె కంటపడింది. ఆమె ఒక్క క్షణంపాటు అదరిపడి, తక్షణం యీ సంతోషవార్త తన సఖి చెవిన వేయడానికి అంతఃపురంలోకి పరుగుపెట్టింది.

## 11

లవంగి దీర్ఘాలోచనలో మునిగి పడుకుని ఉంది. ఆమె ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ ప్రియసఖి పరుగున వచ్చింది. "రాకుమారీ, రాకుమారీ మీకో శుభవార్త తెచ్చాను" అంటూ ఆయాసం తగ్గడానికి తనూ ఓరగా కూర్చుంది. ఒక్క ఉదుటున లేచి కూర్చుని.


దీపావళి పండుగకు మా అభినందనములు

ప్రతిదినము పండుగే!

ప్రతి భోజనము విందే!




దీర్ఘ కాలములో మంచి సరుకులే మీకు లాభకరము! చౌక సరుకులే ప్రియ మనిపించును!

ప్రత్యేకముగా తెలుగు వారికి ఇష్టమైన రుచులలో చేయబడుచున్న

డయమండ్ మార్కు

అప్పడములు, సాంబారు, రసం పొడుములు ఎల్లప్పుడు వాడి సుఖము, సంపూర్ణ తృప్తి పొందండి!

వాడిన వారిని అడగండి!

వస్తున్నది—మా నైట్ క్వీన్ మార్కు.......ఎదురు చూడండి.




డయమండ్ బిజ్‌నెస్ కార్పొరేషన్,

హైద్రాబాదు-20. :: బొంబాయి-54.

లవంగి తన సఖి చేతులు రెండూ తన చేతుల్లోకి తీసుకుంటూ "ఏమిటి? త్వరగా చెప్పు" అంది. చెలి తల అడ్డంగా వూపుతూ. "ఊహూ ముందు నాకేం బహుమతి యిస్తావో చెప్పు" అంది.

"త్వరగాచెప్పు నీకేం కావలిస్తే అదే యిస్తాను త్వరగా చెప్పు" అంటూ చెలి భుజాలుపట్టుకుని వూపేసింది లవంగి.

చెలి నవ్వుతూ "అబ్బా! ఎంత ఆత్రుత! అయితే కొంత అయినా ఊహించావన్నమాట!"

"అబ్బబ్బ. నన్ను చంపక చెప్పు చెలీ" బ్రతిమాలింది.

"నీ ప్రియతముడూ" యింకా పూర్తిగా చెప్పకుండానే లవంగి మాట కల్పి "నువ్వు చూశావా? వారు నిజంగానే ఆగ్రా వచ్చారా? చెప్పు. త్వరగా చెప్పు" ఆత్రంగా అడిగింది.

"అబ్బబ్బ. చెప్పు. అంటావే గాని నువ్వు నన్ను చెప్ప నిస్తున్నావా?....వారు ఆగ్రా రావడమేకాదు. కోటలో పాగావేశారు?" అంది ఉత్సాహంగా.

లవంగి చెలి గెడ్డం పట్టుకు బ్రతిమాలుతూ "వివరంగా చెప్పు చెలీ" అంది.

"అసఫ్‌ఖాన్‌జీతో మాట్లాడుతుండగా చూశాను. రేపటివుదయం ప్రభు దర్శనానికి ఏర్పాట్లు చేస్తానని అసఫ్‌ఖాన్ వారు చెప్పారు. రాకుమారీ. ఇది విన్నావూ. తమప్రియుడు రాత్రిపూట దొంగతనంగా కోటలో ప్రవేశించాలని చూశారట" నవ్వుతూ చెప్పింది.

లవంగి సిగ్గుతో తన చేతుల్లో ముఖం దాచుకుంది.

బలవంతాన ముఖం పైకెత్తుతూ. "ఏదీ. ఆ ముఖం ఓ సారి చూడనీ' అంది చెలి.

"ఛీ పోవే. మరీను....వారి హృదయావేదన నాకు తెలుసు. నాకు తెలుసుండే నేనూ అంతే చేసేదాన్ని....రా అలా తోటలో తిరిగి వద్దాం" అంటూ దారితీసింది లవంగి.

* * *

షాజహాన్ దర్బారు తీర్చి కూర్చుని ఉన్నాడు. అతని హుందాను రెట్టిస్తూ ఇంకా అందంగా కన్పిస్తూంది మయూర సింహాసనం. దర్బారు నిండుగా వుంది. అధికారులు, సర్వాధికారులు, పుర ప్రముఖులు అంతా విచ్చేసి వుండడం మూలాన కొలువు కన్నుల పండువుగా వుంది.

రాజ దర్బారుకు అసఫ్‌ఖాన్ జగన్నాధుని వెంటపెట్టుకునివచ్చాడు. చక్రవర్తికి వంగి సలాములుచేస్తూ "అస్సలామాలేకుమ్ జహాపన్న!" ప్రభువుల పరిచయ భాగ్యం కోసం తహతహలాడే యీ పండితుని తమ సాన్నిధ్యంలోకి తీసుకుని వచ్చాను.

"పండితులా?" అని ప్రశ్నిస్తూ జగన్నాధుని వైపు చూశాడు షాజహాన్.


*Deepavali Greetings from*

Phone : 71143

# GAUTAM ROLLING MILLS

**A-14, B-8 & 9, Industrial Estate, Moula Ali, Hyderabad-40.**

***Manufacturers of*** M.S. ROUNDS, FLATS, ANGLES, CROWBARS WINDOW-SECTIONS ETC.

INDUSTRIAL MACHINERY, MINING MACHINERY, GENERAL FABRICATION, AGRICULTURE IMPLIMENTS AND SPECIAL STEELS.

**FREE ADVICE RENDERED** for suitable Iron Materials for building Construction & Tested Material Re-rollers.



జగన్నాధుడు సవినయంగా నమస్కరిస్తూ "ప్రణామాలు చక్రవర్తీ నేను పండితుణ్ణే కాదు. గాయకుణ్ణి కూడా. తమ దర్శన భాగ్యం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను." అని చేతులు జోడించాడు.

ప్రక్కనే వున్న రాజోద్యోగి జగన్నాధుని పొడుస్తూ "అయ్యా చక్రవర్తికి సాష్టాంగ నమస్కారం చెయ్యాలి" అని గొణిగాడు.

జగన్నాధుడు చిరునవ్వు నవ్వేడు. ఒక్క భగవంతునికి మినహా సాష్టాంగ నమస్కారం నే నెవరికీ చెయ్యను. అది శాస్త్ర సమ్మతం కాదు. మత ఆచారాలు. రాజలాంఛనాలూ కూడా చక్రవర్తి దైవ స్వరూపులు అంటున్నామేగాని దైవమే అనడంలేదే!" అన్నాడు.

దర్బారులో చీమ చిటుకుమన్నా వినబడే టంత నిశ్శబ్దం ఆవరించింది—జగన్నాధుని సమాధానం విని. కాని మరుక్షణమే—ఒకటే గుసగుసలు బయలుదేరాయి. 'ఎంతటి ధైర్యం యీ యువకునికి' అంటూ ఆశ్చర్యపడ్డారు. 'అదిగో చక్రవర్తికి కోపం వచ్చినట్టుంది. సింహాసనం పైనుంచి లేస్తున్నాడు' అన్నాడు పక్కవానితో—ఒక రాజోద్యోగి. 'ఈ కుర్రవానికి చావు తప్పదు' అని నిశ్చయించారు తల నెరసిన రాజకీయ పండితులు. 'చక్రవర్తిని అవమానిస్తే మరణమే కదా శరణ్యం?' అనుకున్నారు.

షాజహాన్ ముఖం గంభీరంగా ఉన్న పెదవులు నవ్వుతున్నట్టే వున్నాయి. హుందాగా ఒక్కొక్క మెట్టే దిగి జగన్నాధుని సమీపించాడు.

దర్బారు మందిరంలో జనం వున్నారా లేరా అన్నంత నిశ్శబ్దం ఆవరించింది. మరుక్షణంలో ఒకటే హర్షధ్వానాలు చెలరేగాయి.

షాజహాన్ జగన్నాధుని సమీపించి ఆప్యాయంగా కౌగలించుకొన్నాడు. "పండితవర్యా మీ సమయజ్ఞత మెచ్చ తగినది. అసఫ్ ఖాన్, యీ విప్రునియం దసమాన ప్రజ్ఞ కలదని తోచుచున్నది. మీ మన్ననకు పాత్రుడైన యీ పండితుని మేము ముఖ్యముగా నాదరించాలని నిర్ణయించాము." అంటూ సభాసదుల వైపు తిరిగి "సభాసదులారా, ఈ పండితుడు చేసినది చక్రవర్తికి అవమాన కరమేమీకాదు. ఆ అల్లాను మినహా సిజిద్దీ ఇంకే మానవమాత్రునికి కూడదు. ఇదే ఈ నాటినుంచి యీ సభలో నేను శాసిస్తున్నాను. అని గంభీరంగా పెలవిచ్చారు. "పండితవర్యా మీ రీ నాటినుండి మా ఆస్థాన విద్వాంసులు. ప్రతిదినం. మీ గాన మాధురితో మీ కవితాప్రతిభ పాటవంతో మమ్ములను ఆనందింపచెయ్యండి" అంటూ ఒక ఉన్నతాసనంవైపు జగన్నాధుని నడిపించి ఆశీనుని చేసి తిరిగి మెట్లెక్కి సింహాసనంపై కూర్చున్నాడు షాజహాన్.

చక్రవర్తి కూర్చున్న తరువాత, వినమ్రతతో చేతులు ముకుళించి తలవంచి "కృతజ్ఞుణ్ణి చక్రవర్తీ. కృతజ్ఞుణ్ణి" అని తిరిగి కూర్చుంటాడు.

అప్పుడే బేగమ్‌లు కూర్చుని దర్బారు తిలకించే పై పరదా హాలులోకి వచ్చిన లవంగి జగన్నాధుని చూసింది. అదే క్షణంలో పైకి చూసిన జగన్నాధుని దృష్టి లవంగీ ముఖబింబంపై నిలచింది.

దర్బారుహాలుపై చుట్టూవున్న పరదాల వెనుక కూర్చుని జనానా దర్బారు విశేషాలు తిలకిస్తున్నారు. లవంగికన్య మనస్సు జగన్నాధుని ఎప్పుడో చేరిపోయింది. ఇక ఒక్క క్షణంకూడా అక్కడ నిలువలేక అంతఃపురంలోకి వెళ్లిపోయింది. ఆమె ఆనందం వర్ణనాతీతం. తిన్నగా ముంతాజ్ ఆంతరంగిక భవనంలోకి పరుగెట్టి తల్లి మెడ కౌగలించుకొంది. "అమ్మీజాన్. నాకు నాట్యంచేయాలని ఉంది." అంటూనే మైమరచి నాట్యం చేస్తూ ప్రకృతి సహితం పరవశించేలా పాడుతూ తన ఆనందాన్ని దాచుకోలేక వెలిపరచింది లవంగి. తన గానంలో, నాట్యంతో తనలో గూడుకట్టుకొనివున్న ప్రేమని సంతోషాన్ని వ్యక్తంచేస్తూ ఉప్పొంగింది.

సాదరంగా నాట్యం తిలకిస్తూ అక్కడక్కడ పాట భావానికి నాట్యపు భంగిమలకి ముగ్ధురాలవుతూ "సెహబాస్ బేటీ!" అంటూంది ముంతాజ్.

జనానాకి తెలియపరచకుండానే తిన్నగా దర్బారునుంచి అంతఃపురంలోకి అడుగెట్టాడు షాజహాన్. అమితోత్సాహంతో మైమరచి నాట్యం చేస్తున్న లవంగిని చూసి అలాగే నిలబడిపోయాడు నాట్యం ముగిస్తూ అటు చూసిన లవంగి బెదరిన లేడిలాగా లోపలికి పరుగెత్తింది. షాజహాన్ ముంతాజ్‌ను సమీపిస్తూ "బీగం, మన లవంగి యింతటి నాట్యకత్తె అని ఎప్పుడూ చెప్పలేదేం" అంటూ ముంతాజ్ చెంత కూర్చున్నాడు. అప్పటిదాకా అక్కడేవున్న దాసదాసీలు పక్కకి తప్పుకొన్నారు.

ముంతాజ్ నవ్వుతూ "నాకుమటుకు ఏం తెలుసు జహాపనా! మేఘావృతమైన ఆకాశం నెమలిని పురికొల్పుతుంది. వీనుల విందు చేసే నాదస్వరధ్వని నాగుని పడగెత్తి నాట్యం చేయిస్తుంది. కన్నెపిల్ల మనస్సు ఎవరేనా దోచుకున్నప్పుడే కదా హంస నడకలతో కలకంఠంతో ఉప్పొంగుతుంది? మన లవంగి...." ఆగింది ముంతాజ్.

షాజహాన్ నవ్వుతూ, "ప్రియా, నీది ప్రేమైక హృదయం. రసధునివంటి నీ అండన పెరిగిన మృణ్మయ బొండికకూడా జీవం

పుంజుకుంటుంది కదా ! ఇక నీ కడుపున పుట్టిన బిడ్డల సంగతి వేరే చెప్పాలా ? అయితే మా ముఖ్య మిత్రులకీ యీ కన్నులపండువ చేయించాలని కోరికగా వుంది మాకు" అన్నాడు.

ముంతాజ్ భర్త హృదయంపై తల ఆన్చుతూ "జహాపనా, మీరు కోరాలేగాని అదెటువంటి దుస్సాధ్యమైనదైనా తీరుస్తానే— అలాంటిది మనబిడ్డ నాట్యం తిలకించాలన్న కోరిక ఓ గొప్పా. రాబోయే మీ జన్మదినాన, లవంగి నాట్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తాను. సరేనా ?" అని అడిగింది.

షాజహాన్ తన ప్రేయసిని కౌగిట పొదువుకుంటూ, "నిన్ను కాదనగల ధీమంతుడా యీ షాజహాన్. దేశానికి చక్రవర్తేగాని నీ హృదయాధి రాజుని. నీ దాసుణ్ని కదా !" అంటూ శయనాగారం వైపు నడిచాడు.

భక్తి ప్రేమనిండిన కళ్ళతోనే తన భావాన్ని వ్యక్తం చేస్తూ సాగింది ముంతాజ్.

## 12

జగన్నాధుని రాజమందిరంలో విడిది ఏర్పాటు అయింది. అతని హృదయంలో ఇంకా లవంగిని చూడలేదన్న తపన వేధిస్తూంది. రాజ దర్బారులో కన్నులకు కన్పించి మరుగైన క్షణంనుంచీ ఆవేదన మరీ హెచ్చింది.

బలరాముని తీసుకొని రాజోద్యానవనంలో యిటూ అటూ పచార్లు చేస్తున్నాడు జగన్నాధుడు. ఈ అనవసరపు తిప్పట బలరామునికి విసుగ్గానే వుంది. ఉండుండి ఒక చెట్టుకింద కూర్చుని తిరిగి లేస్తున్నాడు. దూరంలో అంతఃపురం కనిపిస్తూంది. జగన్నాధుని దృక్కులు పదే పదే అటే మళ్ళుతున్నాయి. ఎక్కడైనా మెరుపు మెరపినట్లు లవంగి దర్శనం కాక పోతుందా అని అతని ఆశ. జగన్నాధుని ఆత్రుతను కనిపెట్టి "ఏం పండిత వర్యా, ఎందుకింత విసుగ్గా వున్నారీ రోజు ?" అన్నాడు బలరాముడు.

వేళా కోళంగా తన స్నేహితుని చెవి మెలివేస్తూ "బలరామా ఆస్థానంలో పడింత పర్యుణ్ణిగాని నీకు స్నేహితుణ్ణి కదా !" అన్నాడు.

చెవి చేతిలో రాసుకుంటూ "ఆ చక్రవర్తి అల్లుని పయ్యాక వుండాలికదా ఈ స్నేహం ?"

జగన్నాధుడు నవ్వుతూ, పోనీ నీకూ ఆ లవంగి కన్య చెలికత్తెకి వివాహం చేయించితే నన్ను పీడక వుండవచ్చు. ఏ మంటావు ?" అని వేళాకోళం చేసేడు.

హఠాత్తుగా అటు దూరంలో చెంగు చెంగున గెంతుతూ లేడి పిల్లలాగా లవంగి తోటలోకి ప్రవేశించింది. 'రా కుమారీ' అని


అందమైన తెలుగు టైపులకు
పది పాయింట్లనుండి 72 పాయింట్లవరకు బోల్డు రోమన్ ఇటాలిక్ టైపులకు
అందమైన ముద్రణ నిచ్చుటకు, సకాలములో అందజేయుటకు

సంప్రదించండి :

# ది డక్కన్ టైప్ ఫౌండ్రీ

8-1-318, శివాజీ నగర్,

సికింద్రాబాద్ (ఆం. ప్ర.)

ఫోన్:
ఫాక్టరీ - 72890

ఫోన్:
సేల్స్ డిపో - 51778

అత్యాధునికమైన మోనో మిషన్లు, లెడ్ తయారుచేయుటకు
విదేశమునుండి దిగుమతి చేసిన మిషన్లు కలిగివున్న సంస్థ.

పిలవబోయి ముందుకి కొంచెం నడిచి ఆగిపోయాడు జగన్నాధుడు. దీర్ఘంగా నిట్టూర్చాడు. "ఏం జగన్నాధా ఆగావు?"

నిస్పృహతో నిట్టూరుస్తూ "ఇది రాజోద్యానవనంగాని గంగా తీరం కాదుకదా!" అన్నాడు.

"బలేవాడివే. రాజు మెచ్చిన బ్రహ్మచారివి నీవు. నీకిక్కడ ఎదురు చెప్పడానికి ఎవరున్నారయ్యా. నీ పిచ్చిగాని!" నవ్వేశాడు బలరాముడు.


"అందుకని? రాజమర్యాదలను కాదని ఉన్న మర్యాదను పోగొట్టు కొమ్మనా నీ సలహా? మనకీ రోజు యింతే ప్రాప్తం. నడు వసతి చేరాలి. ఈ రోజేకదా తండ్రిగారు ఢిల్లీ నగరానికి విచ్చేసేది?" అంటూ వసతిగృహం వైపు దారితీశాడు జగన్నాధుడు.

జగన్నాధుడా రాత్రి విశ్రమించాడేగాని కన్నుమూయలేదు. ఎడ తెగని ఆలోచనా పరంపరలనడుమ మెరుపు తీగలాగా లవంగి రూపం తటిల్లున మెరసి మాయమై అతనిలోని విరహాగ్నిని రాజ వేస్తూంది.

తొలి కోడి కూసేవరకూ మెలుకువగా వుండి, కలత నిద్రతో కన్నుమూసి నిద్రకి ఒరిగాడు జగన్నాధుడు.

* * *

ఉదయం చక్రవర్తి కొలువు అతి కోలాహలంగా వుంది.




సూర్యోదయం పూర్వపు కార్యక్రమాలని సక్రమంగా ముగించుకొని కొలువుకు సన్నద్ధుడైన జగన్నాధుడు తన తండ్రిగారిని వెంట బెట్టుకొని రాజదర్బారుకు బయలుదేరాడు.

కొలువులో అడుగుపెట్టగానే సభాసదులు అతి గౌరవంగా జగన్నాధుని ఆహ్వానించడం, దారి వదలడం, ఓహో అని గొప్పగా చెప్పుకోవడం పేరిభట్టుగారికి అమిత ఆనందదాయకంగా ఉంది.

చక్రవర్తి ఆగమనంతో సభలో కోలాహలం సద్దుమణిగింది. చక్రవర్తి ఆసీనులైన వెంటనే అంతా కూర్చోనిచ్చి జగన్నాధుడు సింహాసనాన్ని సమీపించాడు. వినయంగా అంజలి ఘటించి—

Book Your Lambrettas

WITH

**UNITED SALES & SERVICE (Hyd.) Co.,**

**(AUTHORISED LAMBRETTA DISTRIBUTORS FOR TELANGANA, KRISHNA, GUNTUR DISTRICTS)**

***"United House"* 5-9-101/3, Public Garden Road, HYDERABAD-1.**

**Grams : LAMBRETTA'** **Phone : 33498**

**DISTRIBUTORS FOR ALMONARD FANS & ARCO AIR CONDITIONERS**

**(Dealers wanted Throughout Andhra Pradesh)**

MODERN UPTO DATE SHOWROOM & BIGGEST BASEMENT SERVICE STATION BUILT ON PUBLIC GARDEN ROAD, HYDERABAD

**PLEASE DROP IN AND WE ASSURE YOU COMPLETE SATISFACTION**

*COMPLIMENTS*

*FOR*

*THE*

*SEASON*

NOTA BENE ENTERPRISES

**III-S-30, Lal Bahadur Stadium**

**HYDERABAD**

**Branch : Main Road, Kakinada.**

PRODUCTS HANDLED

| DOMESTIC | INDUSTRIAL & AGRICULTURAL |
|---|---|
| Crompton Lamps & Tubes | Loadster Miniature Circuit Breaker |
| Crompton Fittings | Crompton Exhaust Fans |
| Crompton Ceiling and Table Fans | Crompton Metal Clad Plugs & Sockets |
| Sumeet Mixers | Crompton Motors & Pumpsets |
| Larsen & Toubro Fuse Switches | Essen Deinki Control Accessories |
| Tenby Pilot Electrical Accessories | Remco Energy Meters |
| Telson Cables | |


''పాదుషా! ప్రణామాలు. నా తండ్రిగారు పరమవేదాంత దురంధరులు. మంత్రివేత్తలు శ్రీ పేరిభట్టు నామధేయులు. వీరి కడుపు పంటను నేను. నన్నాదరించిన పాదుషావారి ఔదార్యం కనులారా చూడాలని. కృతజ్ఞతలు తెలపాలని ఢిల్లీ పట్నం వేంచేశారు.'' అని తండ్రిని పరిచయం చేశాడు.

పేరిభట్టు చక్రవర్తికి నమస్కరిస్తూ ''నమోస్తు సార్వభౌమా. చిరకాలము దక్షిణ హిందూదేశానికి రాజప్రతినిధిగా నుండి. తెలుగు నాట కొంతకాలం నివసించుటచేత మా కర్నాటగానము నందు. మీ వాఙ్మయమునందు చక్కని రుచి ప్రభువులకు కల్గినది. అమరినది.'' అన్నాడు గంభీరస్వరంతో.

షాజహాన్ ప్రభువు సాదరంగా దగ్గిరలో నున్న ఒక వున్నతాసనం చూపుతూ ''మీ కుమార రత్నం మాకావిషయంలో ఎక్కువ మక్కువ కల్గ చేసినారని తలపోయరాదో?'' అంటూ చిరునవ్వు నవ్వాడు.

''ఎంతమాట! ఎంతమాట ప్రభూ. షాజహాన్ చక్రవర్తులు. రాజకుమారులు—హిందూమహమ్మదీయ విజ్ఞానములు రెండూ రెండు నేత్రములవలె చూచుకొనుట! ఈ మొగలాయి రాజ్యమును అఖండవైభవముతో వెలయింప బూనుట చాల ముదావహం.'' నమస్కరిస్తూ పేరిభట్టు కూర్చున్నాడు.

''అసఫ్‌ఖాన్‌జీ. పండితవర్యునికంటే వారి తండ్రి అయిన వీరిని ఉచితరీతిని సత్కరింత నా కోరిక.''

అసఫ్‌ఖాన్ తక్షణం లేచి నిలబడ్డాడు. అతని వెంటనే జగన్నాధుడు కూడా లేచి నిలబడి 'మహాప్రభూ మరిక మాకు సెలవా?' అని అడిగాడు. షాజహాన్ తలూపడంతో పేరిభట్టు కూడా లేచి ''విజయోస్తు సార్వభౌమా! పునః దర్శనాభిలాషలో ఈ విప్రుడు సెలవు తీసుకుంటున్నాడు.'' అని నమస్కరించి తన కుమారుని అనుసరించాడు.

దైనందిన కార్యక్రమంలోకి దర్బారు ప్రారంభం అయింది.

## 13

షాజహాన్ శయనాగారం ఉన్న ఉద్యానవనంలో అంతా ఒకటే హడావిడిగా వుంది. అప్పుడే రాజప్రాసాదంవైపు రాబోతున్న జగన్నాధునికి లవంగి చెలికత్తె ఎదురైంది. ''రాజకుమారి కుశలమా?'' అని ప్రశ్నించాడు.

''ఏంచెప్పనయ్యా. నిన్న చీకటి పడేవేళ చక్రవర్తిని పాము కాటేసింది. మరణవేదన పడుతున్నారు, ముంతాజ్ బీగమ్ మసీదులలో ప్రార్థనలు జరుపవలసినదిగా హుకుమ్ చేశారు'' అంది ఆత్రంగా.

''ఆస్థాన వైద్యులేమైనట్టు? ఇంత సమయం వృధాచేశారేం?''

''అంతా ప్రయత్నాలు విరమించారు. ఇక లాభంలేదని దైవం మీద భారంవేశారు.'' అంది దుఃఖం పుట్టిపడుతున్న కంఠస్వరంతో.

"పాదుషావారి చెంతకు ఇంకొక్క పదిక్షణాలలో వస్తాను. విస్పృహకూడదు" అంటూ త్వరితగతిని వెనుతిరిగి తన వసతి గృహంవైపు నడిచి పోయాడు జగన్నాధుడు.

వసతి గృహంనుంచి తండ్రి పేరి భట్టును వెంట బెట్టుకొని చక్ర వర్తి శయినాగారం తిరిగి చేరాడు.

లోపల ఒళ్ళు తెలియని స్థితిలో పడివున్నాడు చక్రవర్తి.

"ఔరా. ఎంతటి అపచారం. మంత్ర శక్తికి కట్టుపడని పాము వుండదు....నాయనా జగన్నాథా రెండు దర్భలు తెప్పించు" అని పురమాయించి షాజహాన్ కప్పుకున్న కాశ్మీరశాలువ తొలగించి పాదం పరీక్ష చేశాడు.

పక్కనే కటిక నేలపై పద్మాసనం వేసుకుని కూర్చుని మంత్రోచ్చారణ ప్రారంభించాడు. జగన్నాధుడు దర్భలు ఆయన చేతుల్లో వుంచి పక్కకు తప్పుకొన్నాడు.

బయట అంతా ఆత్రుత నిండిన విషాద వదనాలతో నిశ్శబ్దంగా వేచివున్నారు. గంభీర స్వరంతో మంత్రోచ్చారణ యెవరికీ విన బడడం లేదు. లోపల కూడా గంభీరమైన నిశ్శబ్దమే ఆవరించి వుంది.

ఇంతట్లో....జర జర సాగుతూ ఉద్యానవనపు పచ్చిక తివాసీలు దాటుకుని ఒక నాగుబాము ప్రాకి వచ్చి తిన్నగా శయనాగారం ప్రవేశించింది....పాము రాజుగారి పాదాన్ని చుట్టుకుంది. కరచిన చోటనే తిరిగి కాటు వేసింది. మరుక్షణం వచ్చిన దారినే ప్రాకి బయటకు వచ్చేసి ఉద్యానవనంలో మారింది. పేరిభట్టు యింకా ధ్యానముద్రలోనే వున్నాడు. కొన్ని నిముషాల తరువాత నిద్రలోంచి లేచినట్టు లేచి ఒళ్లు విరుచుకున్నాడు షాజహాన్. ప్రక్కనే నేలమీద పద్మాసనం వేసుకొని ధ్యానముద్రలో వున్న పేరిభట్టుని చూసి అంతా గ్రహించాడు. దిగి కృతజ్ఞతతో తలవంచి నమస్కరించి "మహానుభావా? ప్రాణదానం చేశారు. తమకు ఏమిచ్చి నా రుణం తీర్చుకోకలను? నా కృతజ్ఞతని ఈ చిహ్న రూపంలో మాత్రమే చూపకల్గుతున్నందుకు చిన్నపడుతున్నాను" అంటూ తన వేలిని వున్న రాజ ముద్రిక పేరిభట్టు చేతిలో ఉంచాడు. రాజ గృహం ఇకపై మీ స్వంత గృహంగా భావించండి. మీకీ ప్రాసాదంలో సంచరించే సర్వ హక్కులు యిస్తున్నాను.

పేరిభట్టు భక్తిభావంతో చేతులు జోడించి విన్నాడు· "అంతా దైవానుగ్రహం సార్వభౌమా, నేను నిమిత్తమాత్రుణ్ణి."

"అలా అనకండి బ్రాహ్మణోత్తమా. ఈ సువిశాల భారతావనికి సార్వభౌముణ్ణి అయితేనేం గాక. మీ రాకవల్లనే కదా బ్రతికాను! ఎప్పటికీ ఈ కృతజ్ఞతాభావం నా వెంట వుంటుంది."

"అది తమ అంతరంగిక మార్దవానికి చిహ్నమేగాని వేరుకాదు చక్రవర్తీ. ఇక నాకు సెలవిప్పించి తమరు విశ్రమించండి" అని నమస్కరించి బయటకు నడిచాడు.





మా ఇతర ఔషధములు :

గర్భరక్షక : గర్భపోషణకు, సుఖప్రసవమునకు

మాదీఫల రసాయనం : వేవిళ్ళకు, మలబద్ధకమునకు

సౌభాగ్య శొంఠి : ప్రసవానంతరము బలమునకు, క్షీరవృద్ధికి

ఉషా కాంతు పెళ్లైనప్పుడు జాగర్తగా ఉండూ అంటె
అమ్మ !! విన్నాను కాదు !!!



చక్రవర్తికి నయం అయిందని విని అందరి ముఖంలో సంతోషం వెల్లివిరిసింది. తన కుమారుని చేయి వూతగా కొని పేరిభట్టు తమ నివాసంవైపు వెళ్లిపోయాడు.

రాజధానీ నగరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎక్కడ విన్నా పేరిభట్టు మంత్రబలాన్ని గురించి వింతవింత వివరాలతో చెప్పుకొంటున్నారు. "ఆహా! ఎంత అదృష్టం" అని అంతా అనుకోడమే.

• • •

రాజోద్యానవనంలో జగన్నాథుడు ప్రియసమాగమంకోసం తహతహలాడుతూ, కాలిబాటలవెంట తిరుగుతూ, తాము గంగాతీరాన పాడుకొన్న ప్రేమగీతిక తనలో తనుగా పాడుకొంటూ నడుస్తున్నాడు. అదొక పిలుపువలె పాడి కాస్సేపు నిరీక్షించి వింటున్నాడు—బదులుగా లవంగి కంఠస్వరం వినవస్తుందేమో నన్నట్టు. కాని బదులు వినబడక తిరిగి నడక సాగిస్తున్నాడు.

• • •

అంతఃపురంలో ఈపాట చెవిన పడగానే పంజరంలో పక్షిలా అయింది లవంగి పరిస్థితి. రాకుమారి రోషనార చెలికత్తెలతో కూర్చుని పాచికలు ఆడుతోంది. లవంగి లేవబోతే లవంగి చేయిపట్టుకొని ఆపుతూ "ఆటమధ్యలో లేస్తావేం? కూర్చో" అని కూర్చో పెట్టింది.

"ఈ పూటకిక చాలు. నాకిక కుతూహలం పోయింది...." అంది లవంగి అయిష్టంగా ముఖంపెట్టి.

"అహా! క్రిందటి క్షణంవరకు ఉన్న వుత్సాహం చిటికలో ఎలా పోయింది?" వేళాకోళం చేసింది రోషనార.

"క్షమించుదీదీ. నేనిక ఒక్క ఆటకూడా ఆడలేను."

"పోనీ, ఆట కట్టేద్దాం. నీహఠావిడికి కారణం ఏమిటో చెప్తావా?" అంటూ అంతా లవంగి చుట్టూ గుమి గూడారు.

"చుట్టూవున్న వారిని వెళ్ళమను. నీకొక్క త్తెకే చెప్తాను" అంది లవంగి—తప్పుదని గ్రహించి "మీరంతా వెళ్ళండి" అని ఒక్క మాట చెప్పడంతో అంతా వెళ్లిపోయారు. "ఇక చెప్పు." అని లవంగి చెంత కూర్చుంది రోషనార.

"మన ఆస్థాన పండితులు తెలుసా?" అడుగు తూంచేనే లవంగి చెంపలు ఎరుపెక్కాయి.

"అదానంగతి!" అంటూ లవంగి ముఖం పై కెత్తి "నీకళ్ళలో కొత్త వెల్గుకి నీ నడకలో కొత్త హంందాకి కారణం వారేనా?" అంటూ వేళాకోళం చేసింది.

"పో దీదీ, నువ్వు వారిని చూడలేదు. అందుకే వేళాకోళం చేస్తున్నావు." అంది లవంగి.

"చూడు లవంగీ. నువ్వు నాకన్న చిన్నదానివి. అంతస్తుకు తగని వాణ్ని ప్రేమించి అనర్థాలు కోరి తెచ్చుకోకు. ప్రేమకీ ద్వేషానికీ కూడా సమఉజ్జీ ఉండాలి. ఈ తగని ప్రేమలు తీరని వ్యధలే గాని వేరు తేలేవు." అంది రోషనార. "అక్కా నువ్వు పొరబడుతున్నావు. వారు కోటిలో ఒక్కరు. అటువంటి దివ్యపురుషుని వలపు నెచ్చెలి కావడం కంటే ఏ స్త్రీ అయినా కోరేది ఏముంటుంది?" అంది పారవశ్యంతో.

"ఓహో వారంతటి ఉత్తములా?"

"ఆహా! వారు ఉత్తమోత్తములు దీదీ" అంది గర్వంగా లవంగి.

లవంగి చెంపలురాస్తూ 'అయితే నీకు నేను సహాయం చేస్తాను.' అంది రోషనార. "దీదీ నాకు తెలుసు నువ్వు కాదనవని" అంటూ రోషనారను ప్రేమతో కౌగలించుకొంది లవంగి.

మరుక్షణం కౌగలి వదలి లేడిపిల్లలాగా ఉద్యానవనంలోకి పరుగు తీసింది లవంగి.

## 14

ఎంత ఉత్సాహంతో ఉద్యానవనంలోకి వచ్చిందో అంత నిరుత్సాహం ఎదురైంది లవంగికి తోటంతా కలియచూసినా జగన్నాధుని జాడ కనబడలేదు. విసిగి ఓ చెట్టు మొదట్లో కూర్చుండి పోయింది లవంగి. తను రాలేదని వెళ్ళిపోయి వుంటారన్న బాధతో కుమిలిపోతూ అలాగే పడుకుని చేరబడింది.

• • •

తోటలో తిరుగుతున్న జగన్నాధునికి అసఫ్‌ఖాన్ ఎదురయ్యాడు. బాగుండదని అతనితో సహా ఉద్యానవనం దాటి నడిచాడు. "ఏం పండిట్‌జీ చాలా మౌనంగా వున్నారు?" అని పల్కరించాడు అసఫ్‌ఖాన్. "ఏమన్నారు? ఖాన్‌జీ?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు జగన్నాధుడు. అసఫ్‌ఖాన్ నవ్వుతూ. "శరీరమే నాతోకూడా నడుస్తూంది. మనస్సు ఎక్కడో విహరిస్తూంది అవునా?" అడిగాడు.

జగన్నాధుడు దొరికిపోయినట్టు ముఖంపెట్టి "క్షమించాలి నేను అన్యమనస్కుడనై ఉన్నాను. అంతకంటె మరేంలేదు." అన్నాడు.

"నాకూ అంతఃపురంలో కొంచెం పని ఉంది. మీరిక మీవన

విహారం సాగించండి'' అని నవ్వుతూ జగన్నాధుని భుజంతట్టి ముందుకు సాగిపోయాడు—అసఫ్‌ఖాన్. బ్రతుకుజీవుడా అని ఉద్యానవనంలోకి తిరిగి ప్రవేశించాడు జగన్నాధుడు.

* * *

ప్రియుని కోసం చూపి చూపి లవంగి మహల్‌కి తిరిగి నడక ప్రారంభించింది. గబగబ నడిచి భవనం పైభాగంలోకి వెళ్ళిపోయింది. ఆమె మనస్సు మనస్సులో లేదు. ముందు బాల్కనీలో నిలబడి అప్పుడే ఉదయిస్తున్న చంద్రుణ్ని చూస్తూ నిలబడింది.

* * *

ఉద్యాన వనంలోకి ఎంత సేపటికీ లవంగి రాకపోవడంతో మహల్ దిశగా నడిచాడు జగన్నాధుడు.

విషన్నవదనంతో చంద్రుని చూస్తూ నిలబడిన లవంగి అతని కంట పడింది. ఆమె నిలచిన తీరు అతగాణ్ణి ముగ్ధుణ్ని చేసింది.

క్రింద నిలబడి ''ప్రియా? లవంగీ' అని మోహావేశంతో నిండిన కంఠంతో పిలిచాడు.

అదరిపడి కిందికి చూసింది లవంగి. జగన్నాధుడు కనబడడంతో ఆమె ముఖ కవళికలే మారిపోయాయి. అనురాగం నిండింది ఆమె కన్నులలో వంగి ''ప్రియా!'' అంది వినీవినబడనట్టు.

బాల్కనీకి యింకా చేరువగా వెళ్ళి ''ఈ చీకటివేళ యీ వింత వెల్గు ఏమిటి? అనుకొన్నాను. ఇది తూర్పు అయితే లవంగే సూర్య బింబంగా ఉదయిస్తూందని అనుకునేవాణ్ని—చూడు ఆ చంద్రుడు అసూయతో నీకేసి ఎలా చూస్తున్నాడో.'' అన్నాడు.

బాగా ముందుకి వంగి చిలిపిగా నవ్వింది లవంగి. ''నువ్వు మాట్లాడ్డం లేదుగాని నీ కళ్లు మాట్లాడుతున్నాయి....'' అన్నాడు. ''మాట్లాడు లవంగీ పైనున్న నీవు ఆకాశంలో విహరించే దేవ కన్నెకలాగా ఉన్నావు. మబ్బుతెరల మాటు నుంచి మానవ మాత్రులను తొంగి చూసే దేవతలాగా ఉన్నావు నువ్వు....దిగి రానే రావా?''

బేలగా అడుగుతున్న జగన్నాధుని వంక దీనంగా చూస్తూ ''రేపి పాటి సమయానికి ఉద్యానవనంలోకి వస్తాను ఈనాడు వెతికి వేసారి తిరిగి వచ్చాను'' అంది.

''నిద్రవస్తే కలలు వస్తాయి. ఆ కలలో నీవీ రాత్రి నిలచినట్టే నిలచిపోయే కల వస్తుంది....'' అదరిపడి తల పక్కకి తిప్పి చూశాడు జగన్నాధుడు. పక్కనే యింకో వేపు రోషనార కుతూహలంగా చూస్తూ వుండడం కన్పించి. నిట్టూర్చి తిరుగుముఖం పట్టాడు. తిన్నగా తన వసతి చేరి నిద్ర కొరిగాడు.

## 15

మరునాటి సాయంత్రం లవంగిని చూస్తానన్న ఆశతో వచ్చిన జగన్నాదునికి రోషనార ఎదురైంది. ''అస్సలామాలెకుమ్ పండిట్ జీ!'' అంటూ నమస్కరించింది. ''నమస్కారం రాకుమారీ, తమ రిక్కడ?'' అంటూ తడబడ్డాడు. ''ఎవరి రాకకైనా ఎదురు చూస్తూ వచ్చారా కవికుమారులు? నా ఉనికి మీకు యిబ్బంది కల్గించదుకదా?'' అంది చిరునవ్వు చిందిస్తూ.

''ఎంతమాట ఇది మీ ఉద్యాన వనమేగాని నాది కాదుకదా!'' అయిష్టంగా ముఖంపెట్టు కొన్నాడు జగన్నాధుడు. ''అలా ఎందు కనుకోవాలి? మనది కాకూడదని ఎక్కడా లేదు కదా?'' అంది రోషనార.

''అంతటి ఆశపోతు కాదీ బీద బ్రాహ్మడు! నమస్కారం'' అంటూ అక్కడి నుండి కదలిపోబోయాడు. దారి కడ్డునిలుస్తూ ''నిన్న నంతటి ఆవేశంలో ప్రేయసిని ఆరాధించారే? ఏమిటిలా తప్పుకుని పోతున్నారిప్పుడు!'' అడిగింది. జగన్నాధుడు తత్తర పడి, రాకుమారీ, మీరు పొరబడు తున్నారు.''

''నేపొరబడినా నా కర్ణపుటాలు విన్నవి, కన్నులు చూసినది నిజమేకదా పండితవర్యా! లేక ఆమె అందంముందు నా అందం పగటి దీపంలాగా ఉందా?'' నవ్వింది రోషనార.

''తప్పు రాకుమారి, మీరు వెళ్ళరండి నేనీ ఉద్యాన వనంలో ప్రేయసి కోసం వేచి వున్నది నిజమేగాని ఆ ప్రేయసి మీరు ఎన్నటికీ కాలేరు.'' ఆమెను తప్పుకొని నడిచాడు జగన్నాధుడు. అవమానంతో ఆవేశం పెంచుకున్న రోషనార ''ఈ రోషనారది తాచుపగ. మీరు మరిచి పోకండి పండిట్ జీ.'' అంది కోపంగా.

జగన్నాధుడు దానికి తేలికగా నవ్వేస్తూ ''ఈ పండితుడు పేరి భట్టు సుపుత్రుడని మీరూ మరిచి పోకూడదు రాకుమారీ.'' వెనక్కి తిరిగి చూడకుండా నడిచాడు జగన్నాధుడు. ''ఎంత అహంకారం. నీకా లవంగి ఎలా దక్కుతుందో నేను చూస్తాను.'' అంటూ తన మహల్ వైపు వెళ్ళి పోయింది.

* * *

అత్రుతగా అప్పుడే లవంగి ఉద్యానవనం ప్రవేశించి! నలుదిశలా చూస్తూ కూనిరాగం తీయడం ప్రారంభించింది. జగన్నాధుడు కూడా తిరిగి అటువైపు రాసాగాడు. దూరం నుంచి వీరిరువురినీ చూసిన రోషనారలో అసూయ బుసలు కొట్టింది.

అంతఃపురంలో విశ్రాంతిగా కూర్చుని ఉన్న షాజహాన్ ముంతాజ్ ల చెవులకు ఓమధురగానం విన వచ్చింది....షాజహాన్ సార్థకంగా ముంతాజ్ వైపు చూసాడు. ముంతాజ్ చిరునవ్వు నవ్వి తలూచింది. ఆనాడు కాశీలో గంగ ఒడ్డున విన్న గానమేకదా ఇది! అయితే ఆప్రేమికులీ కోటలోనే ఉన్నారన్నమాట. ఎవరక్కడ అని కేకవేసే లోగా ముంతాజ్ సుతారంగా అతని పెదవులు తన చేత్తో మూస్తూ 'జహాపనా' ఈ చల్లని వెన్నెల హాయికొల్పే మలయ మారుతం మీ పహరావాళ్ళను పంపికలుషితం చేస్తారా? యిటువంటి సుందరమైన రాత్రిని నిజమైన ప్రేమికులూ వృధా చేసుకోరు. అవునా?'.

అంది నవ్వుతూ. ప్రేయసి భావాన్ని అర్థం చేసుకున్న షాజహాన్ ముంతాజ్‌ను కౌగిట చేర్చుకున్నాడు.

## 16

ఆరోజు దర్బారులో షాజహాన్ పుట్టినదినపు వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పండితులు షాజహాన్ చక్రవర్తి కీర్తిని వేనోళ్ళ కొనియాడుతున్నారు. జగన్నాధుని కవితా ధారకు అందరూ అచ్చెరు వంది మైమరచిన ఆనందంతో తలమునుకలయ్యారు.

"శహబాష్! పండిట్‌జీ శహబాష్! మీగానామృతం అత్యద్భుతం. మమ్మల్ని ఆనందోత్సాహముల ముంచెత్తారు!" అంటూ మెచ్చుకున్నాడు చక్రవర్తి.

"మహాప్రసాదం చక్రవర్తీ! అది మీ అభిమానం పల్కించిన దేగాని నా నేర్పు కాదు." అన్నాడు తల వంచి.

"సభాసదులారా, నేనీ రోజున జగన్నాధ పండితుని "పండితరాయ" బిరుదాంకితునిగా చేయాలని కోరుతున్నానని" తన ఆశ వెలిబుచ్చాడు చక్రవర్తి. సభాసదులంతా హర్షధ్వానాలు చేశారు. అంతా సంతోషం వెలిబుచ్చారు.

జగన్నాధునివైపు తిరిగి "పండితరాయా, ఈ రోజున యేం కోరినా తీర్చడానికి సంసిద్ధుడను నేను."

"మహాప్రసాదం ప్రభూ. కానీ ఈ కోరిక నాకు అనువైన సమయంలో కోరే స్వేచ్ఛ ప్రసాదించండి" అని నమస్కరించాడు జగన్నాధుడు.

"అలాగే కానివ్వండి" అని తలూపాడు చక్రవర్తి. "పోనీ నా యెత్తు సువర్ణాన్ని స్వీకరిస్తారా?" అడిగాడు.

"బంగారం ఏం చేసుకోను ప్రభూ." అన్నాడు పండితరాయలు. "పోనీ వజ్ర వైడూర్యాలు?" వద్దు చక్రవర్తీ.

"ఐశ్వర్యం వద్దంటున్న వ్యక్తిని చూడడం అరుదు. దీనికేదైనా కారణం వుందా పండితరాయా? జగన్నాధుడేమీ అనకపోవడంతో "మౌనం అర్ధాంగీకారం కదా. అంటే ఏదో కారణం వుందన్న మాట. అయితే మీ రిప్పుడేదైనా కోరిక తప్పదని నేను ఆజ్ఞాపిస్తున్నాను." అన్నాడు నవ్వుతూనే.

"చక్రవర్తీ. నా కా ఐశ్వర్యంతో పనిలేదు. కొంచెం గడువు మాత్రం యిప్పించండి" అని కోరాడు.

"అలాగే కానివ్వండి. రండి నృత్యప్రదర్శనం తిలకిద్దాం" అంటూ అంతఃపురంవైపు దారి తీశాడు షాజహాన్. ప్రముఖులతో పాటు జగన్నాధుడు కూడా లోపలికి నడిచాడు.

లవంగి నాట్యప్రదర్శన ఏర్పాటు చేసింది ముంతాజ్. తండ్రి ముందు అలవోకగా నాట్యం చేయసాగిన లవంగి జగన్నాధుని చూసి


ఇంటింటా వెయ్యి దీపాలు వెలగాలని

భాగ్యనగర్ చిట్ ఫండ్ కంపెనీ

మెయిన్ రోడ్, చిక్కడపల్లి, హైదరాబాద్-20.

దీపావళి శుభాభినందనలు తెలియజేస్తున్నది.

పురివిప్పిన నెమిలిలాగా మైమరచి నృత్యం చేసింది. ఆ నృత్య వైఖ వానికి పరవశుడై తన గానం జత చేశాడు జగన్నాధుడు.

నాట్యం పూర్తికాగానే లవంగి లోపలికి వెళ్ళిపోయింది. "పండిత రాయా, మీ గానమో, లవంగి నాట్యమో మమ్ము పరవశులను చేసింది. ఈ సమయానికి మించిన మంచి సమయం వేరేమి ఉంటుంది. మీ కోరిక ఈ క్షణంకోరక తప్పదు." అన్నాడు షాజహాన్. జగన్నాధుడు తత్తరపడ్డాడు. "ఇది చక్రవర్తి ఆజ్ఞ" అంటూ నవ్వేడు షాజహాన్.

"నాకు ఐశ్వర్యంతో పనిలేదు. లవంగి రాకుమారిని ప్రసాదించండి చక్రవర్తీ" గంభీరంగా తన కోర్కెను వెళ్ళబెట్టాడు జగన్నాధుడు.

"క్యా!" అని హుంకరించి ఒక్కవిసురున లేచి లోపలికి వెళ్ళిపోయాడు చక్రవర్తి. చక్రవర్తితోపాటు అంతా లేచి వెళ్ళిపోయారు. యీ హుంకరింపు విన్న లవంగి మూర్ఛపోయింది.

విచారవదనంతో తన సదనం చేరుకున్నాడు జగన్నాడు.

* * *

అతఃపురంలో బోనులో పులిలాగా తిరుగుతున్నాడు షాజహాన్. ముంతాజ్ మాట కూడా వినేస్థితిలో లేడు. మధు పాత్ర ముందుంచుకుని అదేపనిగా తాగేస్తున్నాడు. "ఆ పేద బాపనికెలా యివ్వను లవంగిని? అల్లారుముద్దుగా పెంచినదాన్ని దారిద్ర్యంలో మగ్గమని ఎలా శాపించను? ఇవ్వనని యీ షాజహాన్ చక్రవర్తి ఆడినమాట తప్పుతాడా?" అని స్వగతం పలుక్కుంటూ మధు పాత్ర పదేపదే నింపుకుని మైమరచేదాకా తాగాడు.

## 17

జగన్నాధుడు మౌనంగా, చాలా గంభీరంగా ఉద్యానవనంలో కూర్చునివున్నాడు. అతనికి కొంచెం దూరంలో బలరాముడు మాట్లాడకుండా కూర్చునివున్నాడు. రోషనారా అతనికోసం వెతుకుతూ ఉద్యానవనంలోకి వచ్చింది. జగన్నాధుని చూపి "పండిత రాయా, ఇంత మేధావంతుడవై ఉండీ చక్రవర్తి కోపానికి గురి అయ్యావు. చూశావా?" అంది.

"ఫరవాలేదు రాకుమారీ, చక్రవర్తి కోపం తగ్గాక పశ్చాత్తాప పడతారు" అన్నాడు జగన్నాధుడు నెమ్మదిగా.

"కాని అగ్నిలో అజ్యం పోసి ప్రజ్వరిల్లచేసినట్టు నీపై ద్వేషం పెంచుతూనే ఉండేవారీ అంతఃపురంలో లేరనా నీ ఊహ?" నవ్వింది రోషనార.

"అలాంటి అసూయాపరులుకూడా ఒకనాటికి సత్యాన్ని గ్రహించక తప్పదు కదా!" తేలికగా జవాబిచ్చాడు జగన్నాధుడు.


ఈ దివ్య దీపావళి శుభసందర్భాన

నూతనంగా ప్రారంభించబడుతున్న

### నవతా క్లాత్ ఎంపోరియం

మెయిన్ రోడ్, చిక్కడపల్లి, హైదరాబాద్-20.

షోరూమును ఒక్కసారి దర్శించండి!

మీకు కావలసిన అన్నిరకాల బట్టలు సరసమైన ధరలకు

పదిశాతం డిస్కౌంట్ బోనస్‌తో సహా లభిస్తాయి

ఇంకా ఆకర్షణీయమైన అనేక స్కీములు!

ఒక్కసారి! దయచేయండి.

"పోనీ నేను నిన్ను తప్పించనా?" చెంతగా వస్తూ అడిగింది రోషనార. దిగ్గున దూరంగా జరిగి "రాకుమారీ, నీ మాటలు నీ అంతస్తుకు తగినవిగా లేవు. నేను నీవు ఊహిస్తున్నంత పిరికివాణ్ణి కాను. స్థిమితం లేని మనస్సు కలవాణ్ణీ కాదు. లవంగీమగ్నమైన నా మనస్సు అన్యాక్రాంతం కాదు. నీ యాసలు అడియాసలే." జవాబుకై ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు జగన్నాధుడు.

"నే లజ్జవిడిచి సూచించినా కాదన్నందుకు ఫలితం అనుభవించక తప్పదు. రోషనారను కాదని ఈ రాజ్యంలో నిలబడేది ఎవరో నేనూ చూస్తాను" కోపంగా వెళ్ళిపోయింది.

* * *

ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో మధుపానంలో సర్వం మరవాలని చూస్తున్నాడు షాజహాన్.

* * *

అటు ఉద్యావవనంలో లవంగీ జగన్నాధులు రహస్యంగా కలుసుకొని ఒకరి కౌగిట ఒకరు ఒరిగి—మైమరచారు. కాని రోషనార మటుకు కనుమూయలేదు. ప్రతీకార వాంఛతో ఆమె హృదయం కుతకుతలాడుతోంది.

లవంగీ జగన్నాధులను ఉద్యానవనంలో చూసిన రోషనార తిన్నగా షాజహాన్ దగ్గిరకి వెళ్ళింది. మధువు మైకంలో తల మునకలుగా ఉన్న షాజహాన్‌ని కుదుపుతూ "పితాజీ పితాజీ, ఏమిటీ దారుణం?" అంటూ రహస్యంగా లవంగి పండితరాయల సమాగమం నేరంగా చెప్పింది. అంత మైకంలోను కోపంగా లేచాడు షాజహాన్. "ఎవరక్కడ?" అని హుంకరించాడు. అంతే కాదు. రోషనార వెంటరాగా ఉద్యానవనం ప్రవేశించాడు. దూరంలో మైమరచి కూర్చున్న ప్రేమికులను చూపెట్టింది రోషనార. ఒళ్లు తెలియని కోపం వచ్చింది షాజహాన్‌కి. "జానే! అందర్" అంటూ ఒక్క పొలికేక పెట్టేసరికి లవంగి లేచి ఒక్కపరుగున అంతఃపురంలోకి వెళ్ళిపోయింది. "ఈ కవిని ఖైదుచేయండి. చక్రవర్తిని అవమానించిన నేరానికి ఇతగాడికి తగిన శిక్ష విధించాలి" అంటూ పహరా వారికి హుకుమ్‌వేసి వెనుతిరిగాడు. "ఈ కవిని ఖైదుచేయండి" అంటూ వికటంగా నవ్వుతూ తండ్రి వెనుక లోపలికి వెళ్ళింది రోషనార.

పదిమంది సైనికులు చుట్టుముట్టి జగన్నాధుని నడిపించుకు పోయారు.

* * *

లవంగి పరుగున పోయి తల్లిపాదాలమీద వాలింది. ముంతాజ్ నిద్రలో వుంది. "మాతాజీ మాతాజీ" అంటూ హృదయవిదారకంగా రోదించడం మొదలెట్టింది లవంగి. అప్పుడే లోపలికి వచ్చిన రోషనార తల్లి పాదాలమీద నుంచి లవంగిని లేవదీసి దూరంగా నడిపిస్తూ "లవంగీ మోహంలో పడి సమయాసమయాలు, యుక్తాయుక్తాలు కూడా గుర్తించే స్థితి దాటిపోయినట్టున్నావే. మాతాజీ మూసిన కన్ను తెరవక పడివుంటే నీ వినోదంగురించి చెప్పవచ్చావా? భేష్ ఎంతటి మాతృప్రేమ?" అని వేళాకోళం చేసింది.

లవంగి రోషనార చేతులు పట్టుకొని "దీదీ నువ్వేనా వారిని కాపాడలేవా? నన్నేం చేయమన్నా చేస్తాను" అంటూ ఏడ్చింది.

"ఇప్పుడు అన్నిటికీ సమయం మించిపోయింది. చక్రవర్తి ఆజ్ఞ నెవరు ఉల్లంఘించకలరు?" అంది తాపీగా.

"పోనీ నేనే పితాజీని వేడుకుంటాను. నిజం చెప్పి ఆయనను దయ చూడమని వేడుకుంటాను." అంటూ షాజహాన్ శయనాగారం కేసి పరుగెత్తింది. కాని పహరావాళ్ళు అడ్డుపెట్టి "ఎవరినీ లోపలికి రానివ్వకూడదని ప్రభువుల ఆజ్ఞ" అని నిలవేశారు. "ఎవరినీ అంటే రాజకుటుంబీకులని కూడా అనా? లెండి అడ్డు" అంటూ ముందుకి సాగబోయింది. కాని వారి యీటెలు అడ్డుగా నిలిచాయి. "అయ్యో యింత ఐశ్వర్యం వుండీ ఇంతమంది బలగం వుండీ నాకు చేయూత నిచ్చే గతిలేక పోయింది!" అని దుఃఖిస్తూ వెనుతిరిగి తన శయన మందిరానికి వెళ్ళిపోయింది లవంగి.

## 18

షాజహాన్ శయనాగారంలో ప్రభువువారి సన్నిధిలో చేతులు జోడించి నిలబడి బ్రతిమాలుతున్నాడు పేరిభట్టు. "మహారాజా నా కుమారునికి ప్రాణదానం చెయ్యండి. ఇదిగో ఆ నాడు మీరు నా కిచ్చిన రాజ ముద్రిక. మీరప్పుడే మరిచిపోయారా. కృతజ్ఞతా భారం నన్ను జీవితాంతం కృంగదీస్తుంది అన్నారే. ప్రభూ జగన్నాధుని మన్నించండి. విడుదల చేయించండి. ఇక ఈ ప్రాంతాల కనబడకుండా మా దేశానికి వెళ్ళిపోతాం. ప్రభూ యీ ముసలి తనంలో నాకు పుత్రశోకం ప్రసాదిస్తారా?" దుఃఖంతో పేరిభట్టు కంఠం పూడుకు పోయింది.

"జగన్నాధుడు మాకు తీరని అవమానం కల్గించాడు. రాజ ద్రోహం క్షమార్హమా?"

"సార్వభౌమా, రసైక హృదయులు మీరు కూడా అలాగే అంటారా? మీరాతని విడుదల చేయించండి. ఢిల్లీనగరం వదలి పోయేలా నేను చూచుకుంటాను' అని పేరిభట్టు బ్రతిమాలాడు.

ఎటూ చెప్పలేక లేచి పచార్లుచేయడం ప్రారంభించాడు షాజహాన్. క్షణం తల పంకించి, "మీరు మాకు ప్రాణదానం చేశారు. దానికి నేను తలొగ్గక తప్పడంలేదు. మీ కుమారుణ్ణి విడుదల చేయిస్తాను. నా కంట పడనివ్వకండి" అంటూ అంతఃపుర అంతర్భాగంలోకి వెళ్ళిపోయాడు చక్రవర్తి.

ఆనందంగా వసతివైపు నడిచాడు పేరిభట్టు.

* * *

ఆ రాత్రిపూట నల్లని ముసుగు ధరించి ఎవరి కంటా పడకుండా

లవంగి కారాగారం ప్రవేశించింది జగన్నాధుని చూడాలని.

ప్రియుని పాదాలదగ్గిర కూలిపోయింది. కటకటాలలోంచి చేతులు చాచి లేవతీసి కౌగలించుకుందామని చూశాడు జగన్నాధుడు. "ఇది కడసారి. ఈ రోజు సంతోషంగా గడిపితే అదే శాశ్వతం అవుతుంది. నా తుదిరోజు విషాదపూరితం చేస్తావా?" అంటూ లవంగి కన్నీళ్ళు తుడిచాడు. "మీరు పారిపొండి. ఎందుకిలా కోరి మృత్యువును వెంటాడుతున్నారు. నా మాట విని తప్పించుకు పొండి" అని ప్రాధేయపడింది లవంగి. విషాదంగా నవ్వేడు జగన్నాధుడు. ఈ రోజు అలాంటివేం మాట్లాడకు. మన గడచిన మధుర ఘడియలు జ్ఞాపకం చెయ్యి." అన్నాడు. "మీ రిలా నవ్వుతూ ఉరికంబంఎక్కుతారు నేనెలా తరవాత జీవించకలను? "ఏడుస్తూ అడిగింది లవంగి. "నీకు జ్ఞాపకం వుందా? ఆ రోజు యిలాంటి రాత్రే నిన్ను చూడాలన్న తహతహతో—మహల్ పైపున కొచ్చి నిన్ను చూశాను. చంద్రుణ్ణి సహితం హేళన చేస్తున్న నీ ముఖం నాకు కనిపించింది." అంటూ మృదువుగా అన్న లవంగి చేయి అందుకుని "నా చెంపకు ఈ చేయి ఆన్చి నిలబడ్డావు. ఆ రోజు నీ వ్రేలి అంగుళీయాన్ని అయినా బాగుండేది అనిపించింది" అంటూ చేతిని మృదువుగా పెదవులతో చుంబించాడు. "ఇక చాలు" అన్నట్టు తలూపుతూ దుఃఖాన్ని దిగమింగుకుంది లవంగి. ఇక తెల్లవారి పోయింది రాకుమారీ" అన్నాడు. లవంగి వెళ్ళలేక వెళ్ళలేక అతణ్ణి వదలి వెళ్ళిపోయింది.

* * *

మహల్‌కి వెళ్లిన లవంగి తన ముసలి సేవకురాలి వడిలో పడుకుని భోరున ఏడవ సాగింది. "అమ్మా లవంగీ, నీ విలా దుఃఖిస్తే నేను చూడలేనమ్మా" అంటూ తల నిమిరింది. లవంగి దుఃఖం ఇనుమడించిందేగాని తగ్గలేదు. "నన్నొదులు తల్లీ నేనీ దుఃఖం చూడలేను. మహారాణి ముందు వ్రాలి సత్యం చెప్పి నిన్ను దక్కించుకుంటాను" అంటూ లవంగి చేతులు వదలించుకుని తిన్నగా ముంతాజ్ మహల్ శయనాగారం చేరింది ముసలిసేవిక.

ముంతాజ్ పాదాలపై బడి రోదిస్తూ "అమ్మా మహారాణీ నా బిడ్డని రక్షించవమ్మా. ఇన్నాళ్లు రహస్యాన్ని కడుపులో దాచుకున్నాను. కాని యిక దాయలేనమ్మా. ఆ బిడ్డ దుఃఖం చూడలేను." అంది. ఆసత్యం నాకు మినహా ఎవరికీ తెలియదు మహారాణీ నన్ను చంపు. నాతో యీ సత్యం సమసిపోయింది. అయితే నేచెప్పి చచ్చిపోతాను" అంది.

ముంతాజ్ దాయి తల నిమిరింది. "ఫరవాలేదు. విషయం విశదంగా చెప్పు" అంది. ముంతాజ్ పాదాలపై తల ఆన్చి "కావలిస్తే యీ తల తీయించండి రాణీ, కాని లవంగి మీ బిడ్డకాదు." ముంతాజ్ అదిరిపడింది. "ఏమిటి నువ్వనేది? లవంగి ఎవరి బిడ్డ? నువ్వు చెప్పేది సత్యమేనా?"

"అవునమ్మా లవంగి ఒక కులీన వంశంలో పుట్టిన పసికందు. తమరు ప్రసవించిన సమయానే ఓ బాటసారి దంపతులు నా పంచన తల దాచుకొన్నారు. వారి బిడ్డ ఆమె. మీకు తెలిస్తే నా బిడ్డేది అని అడిగితే ఏం చెప్పాలో తెలియక ఆ పసిపాపని మీ పొత్తిళ్ళలో ఉంచాను." ఏడుస్తూ జరిగినది చెప్పింది ముసలిది.

ముంతాజ్ ఆలోచనలో పడింది.

"మీ రాలస్యం చేయకండి. నాకే శిక్ష విధించినా సరే. కాని మహారాజు మనసు మార్పించండి" అని ప్రాధేయపడింది.

ముంతాజ్ అనారోగ్యంగా వున్నా లెక్కచేయక నీరసంగానే బయలుదేరి షాజహాన్ ఆంతరంగిక మందిరం చేరింది.

## 19

షాజహాన్ మత్తుగా తాగి పడి వున్నాడు. ముంతాజ్ లోనికి వెళ్ళి పరిస్థితి అర్థంచేసుకుంది. దగ్గరకి వెళ్ళి "నా మాట వినండి. కాలం మించిపోతే మనం చేయకల్గేది చేయి జారిపోయింది. జగన్నాధుని క్షమించండి. నేను లవంగి దుఃఖం చూడలేను" అని బ్రతిమాలింది.

ఆ మైకంలో విసురుగా ముంతాజ్ చేయి పట్టుకున్నాడు షాజహాన్. "ఏమిటి చెప్పావు? మీ ఔరత అంతా యింతే. ఖుషీ చేయిస్తారు. దుఃఖం కల్గిస్తారు." ఒక్క ఉదుటున చేయి విసిరాడు. ముంతాజ్ ముఖం సిగ్గుతో వివర్ణమైంది. చేతి కంకణం క్రింద పడిపోయింది.

దుఃఖంతో పరాభవంతో బయిటికి వచ్చి—అసఫ్‌ఖాన్‌కి కబురంపింది. తన ఆజ్ఞగా జగన్నాధుని బంధవిముక్తుణ్ణి చేయమని తెలియచేసి తన భవనంలోకి వెళ్ళిపోయింది.

రాణి ఆజ్ఞ శిరసావహించడానికి అసఫ్‌ఖాన్ తగు ఏర్పాట్లు చేయడానికి వెళ్ళాడు. అతనికీ తెలుసు ప్రథమ కోపి అయిన మహారాజు తరువాత తన తొందరపాటుకి పశ్చాత్తాపపడతాడని.

* * *

మైకం వదలిన షాజహాన్ కంట కంకణంపడి పహరావాణ్ణి పిలిచాడు. "రాత్రి నా మందిరానికి బేగమ్‌సాహెబా వచ్చారా?"

"హాఁ హుజూర్. తమరు" నీళ్ళు నమిలాడు పహరావాడు.

"అరె సైతాన్. లోపలికి ఎందుకు రానిచ్చావు?" అని కోపంగా అరిచి—త్వరగా ముంతాజ్ మందిరంవైపు నడిచాడు.

ముంతాజ్ తీవ్రమైన జ్వరంతో ఒళ్ళు తెలియక పడి ఉంది. ఆమె పక్కనే కూర్చుంటూ "బేగమ్ నన్ను క్షమించు. ఇక జన్మలో మళ్ళీ షర్‌బత్ తాగను." బ్రతిమాలుతాడు. ముంతాజ్ భారంగానే కళ్ళు తెరిచింది. "నా బిడ్డ దుఃఖం చూడలేను ప్రభూ. జగన్నాధుని విడిపించమని ఆజ్ఞాపించాను" భారంగా చెప్పింది.

"ఫరవాలేదు ప్రియా. నువ్వు నన్ను క్షమించావను." అంటూ ముంతాజ్ తల నిమిరాడు.

ముంతాజ్‌కు జ్వరం చాలా తీవ్రంగావుంది. ఆమె తిరిగి మైకంగా

కళ్ళు మూసుకుని పడుకోవడంతో, రాజ దుస్తులు వదలి షాజహాన్ మోతీమసీదుకు ప్రార్థనార్థం బయలుదేరాడు.

మోతీమసీదులో వేలాది భక్తుల మధ్య తనూ నమాజ్ చేశాడు.

* * *

తెలివిరాగానే ముంతాజ్ చెంతనున్న రోషనారను చూసి "వారెప్పుడు వస్తారు బేటీ, వారొచ్చేదాకా నేను ఉంటానా?" అని అడుగుతూంది అప్పుడే నమాజు పూర్తిచేసుకుని వస్తున్న షాజహాన్ తన ప్రియ భార్య చెంత చేరుతూ, "నన్ను క్షమించు బేగమ్, ఈ నీ వ్యాధికి నేనే కారణం.

ఆప్యాయంగా షాజహాన్ చేతులు తన చేతుల్లోకి తీసుకుంది ముంతాజ్. "మీ రెందుకు నా దుఃఖానికి కారకులవుతారు? మీరే నా సర్వస్వం" అంది నీరసంగా. "నువ్వు ఆరోగ్యంగా వుండాలని అల్లాను ప్రార్థించి వస్తున్నాను. నువ్వు లేచి తిరిగిన నాడు గాని ఈ షాజహాన్ ఎంత మారిపోయాడో గుర్తించలేవు."

"మీరు మారకండి ప్రభూ, మీ రెలావున్నా మీరే నా హృదయాధి నాథులు." అంటూ అతని కౌగిట సద్దుకుంది.

ఆమెను ఆప్యాయంగా కౌగలించుకుంటూ "నీకో చక్కని మహల్ కట్టిస్తాను. అది మన ప్రేమకు చిహ్నంగా లోకంలో శాశ్వతంగా నిలచిపోవాలి." అంటూ అనురాగపూరిత కంఠస్వరంతో యింకా ఏదో చెప్పబోయిన షాజహాన్‌కి ముంతాజ్‌లో చలనం లేక పోవడం తెలిసింది. షాజహాన్ అలాగే పిచ్చివానిలా ఆమెవైపే చూస్తూ కూర్చుండి పోయాడు.

కొద్ది క్షణాలలోనే ముంతాజ్ కనుమూసిన వార్త అందరికీ తెలిసి పోయింది. రాజాంతఃపురంలోనే కాదు ఢిల్లీనగరం అంతటా విషాద చ్ఛాయలు పరచుకున్నాయి.

## 20

అసఫ్‌ఖాన్ విడుదల చేసి జగన్నాధుని హెచ్చరించాడు చక్రవర్తి కంటపడవద్దని—జగన్నాధుడు విషాదంగా నవ్వుతూ, అంత కంటే ఉరికంబము ఎక్కించడం కదా అసఫ్‌ఖాన్‌జీ!" అన్నాడు.

జగన్నాధుడు తిన్నగా యమునానదీ తీరానికి నడచిపోయాడు. అతని హృదయంలో విరహం గూడు కట్టుకొంది. ఎటూ పోలేక అక్కడక్కడే తిరుగుతున్నాడు.

పేరిభట్టు కొడుకును వెతుక్కుంటూ యమునాతీరం చేరాడు. మాసిన గెడ్డంతో విషాదం మూర్తీభవించినట్టున్న జగన్నాధుని చూసి ఆ ముసలితండ్రి గుండె చెరువయ్యింది. "నాయనా నాకీ పుత్రశోకం తప్పదా? అంతా అయిపోయింది కదా. ఇకనైనా నువ్వు కొత్త చిగుళ్లు వేస్తావు. కొత్త జీవితం ప్రారంభిస్తావు అనుకున్నానే!"

"నాన్నగారూ, నన్ను క్షమించండి. మిమ్మల్నిక హింసపెట్టను. నా విధి నడిపించిన బాటవెంట నన్ను సాగిపోనివ్వండి. సెలవివ్వండి" అని తండ్రి సమాధానంకోసం ఎదురుచూడకుండా ముందుకు సాగి పోయాడు జగన్నాధుడు.

దిగాలుపడి నిలబడిపోయాడు పేరిభట్టు.

* * *

షాజహాన్ తన విషాదాన్ని దిగమింగుకొని తను ప్రేయసికై కట్టించదలచిన మహల్ నమూనాలు పరిశీలిస్తున్నాడు. యమున వద్దున నడుస్తూ ఆ భవంతి ఎలా రూపొందుతుందో వూహిం కొంటున్నాడు. దూరంలో విరహగీతి పాడుకొంటూ ఎవడో బాట సారి సాగిపోతున్నాడు. ఆ పాట షాజహాన్ హృదయం కలచివేసింది. అటువైపే నడవసాగాడు. బాటసారి యమునలో కాళ్ళు తడుపుకొంటూ పాడుకొంటున్నాడు. షాజహాన్ అతని చెంత చేరి "మహాకవీ, మహాగాయకా, అంతరాంతరాళాలలో కదలాడే ఊహల వుబ్బులని బాధల కటారులని యింత అందమైన మాటల్లో ఎలా చెప్ప కల్గావయ్యా?" అడిగాడు.

"కారుణ్యం ఎరుగని కఠినశిలా సదృశమైన హృదయం ఒకటి నా గుండెలు బీటలు తీయించింది. నన్ను జీవచ్ఛవంగా చేసింది. నా ప్రేమదేవతని నాకు కాకుండా చేసింది. కొలిమిలో కాలిన బంగారం అయితే వన్నె తేలుతుంది గాని విరహాగ్ని పీడితమైన హృదయం మగ్గిమగ్గి పోయింది బాటసారీ, ఆమాత్రం తెలియదా? ఆ బాధే పాటగా తయారు అవుతుంది. షాజహాన్ విషాదంగా నవ్వేడు. "నేనూ అదేస్థితిలో ఉన్నాను. భయంకరమైన మృత్యుదేవత హస్తం నా ప్రేయసిని లాగివేసింది." తన దారిన సాగిపోవడం ప్రారంభించాడు షాజహాన్.

* * *

జగన్నాధుడు పిచ్చివానిలా తిరిగి తిరిగి సాయంత్రానికి రాజో ద్యానవనం ప్రవేశించాడు. చెట్లను పల్కరిస్తూ విరహంతో, విచారంతో కృంగిపోయి నడుస్తున్న లవంగి అతని కంట పడింది. "రాకుమారీ' అని పల్కరించాడు.

అదరిపడ్డ లవంగి చేష్టలుడిగి నిలబడిపోయింది ఒక్క క్షణం పాటు. మరుక్షణం జగన్నాధుని కౌగిట చేరి మైమరచింది, ఆమె నలాగే పొదవి పట్టుకొని చెట్టుకి జేరబడి కూర్చున్నాడు. ఇన్నాళ్ళ ఎడబాటు అతణ్ణి వివశుణ్ణి చేసింది.

## 21

షాజహాన్ ఉద్యానవనంలో తిరుగుతూ బాటసారి విరహగీతిక జ్ఞాపకం చేసుకుంటున్నాడు. పూర్వంలో ఆ తోటలో నడవడం, పాము కరవడం, పేరిభట్టు ప్రాణం ప్రసాదించడం. లవంగి అమాయకత్వం, జగన్నాధుని గాంభీర్యం అన్నీ జ్ఞాపకం వచ్చాయి. అతని మనస్సు పశ్చాత్తాపంతో నిండిపోయింది. మహల్‌లోనికి ప్రవేశించాడు.

అప్పుడే తండ్రికోసం వస్తున్న లవంగి తండ్రి ఎదురురావడం చూసి నిలబడిపోయింది. ఆమెనే చూస్తూ నిలచాడు చక్రవర్తి. చెంతకు వెళ్ళి ఆమె తల నిమిరాడు. "పితాజీ, మిమ్మల్ని ఒకటి కోరాలని కుతూహల పడుతున్నాను" అంది నెమ్మదిగా లవంగి.

"అడుగు బేటీ, యీ తండ్రి నీకు చేసిన అన్యాయానికి చింతిస్తున్నాడు. నీకేం కావలసినా అడుగు. నిండు హృదయంతో యిస్తాను" అన్నాడు అప్యాయంగా.

"నేను వారి సన్నిధి చేరాలని కుతూహలపడుతున్నాను పితాజీ" అంది లవంగి.

షాజహాన్ అదరిపడ్డాడు. "అవును పితాజీ, వారీ ఆగ్రా పట్టణంలోనే ఉన్నారు. వారి ఎడబాటు నేనింక భరించలేను పితాజీ. మేము యీ ప్రాంతాల కనిపించకుండా వెళ్ళిపోతాము పితాజీ. మమ్మల్ని క్షమించి ఆశీర్వదించండి.

షాజహాన్‌కి సంతోషం కల్గింది. తనవల్ల గాయపడ్డ హృదయాలని దరిచేర్చకల్గే యింకో అవకాశం తనకి లభించినందుకు సంతోషం కల్గింది. "అలాగే అనుజ్ఞ నిస్తాను బేటీ. కాని అది అంత సులభంగాకాదు. రేపు నిండు దర్బారులో నీ పండిత రాయుని శిక్షిస్తాము. సరేనా?" అంటూ త్వరగా వెళ్ళిపోయాడు షాజహాన్.

దిగ్భ్రమ చెంది నిలబడి పోయింది లవంగి. దర్వాజా వెనుక నిలబడి అంతా విన్న రోషనార మండిపడింది.

* * *

దర్బారులో కొలువుతీర్చి కూర్చున్నాడు షాజహాన్. అతనిలోకొత్త జీవం వచ్చినట్టు ఉంది. దగ్గిరలోనే అసఫ్‌ఖాన్ కూర్చుని ఉన్నాడు. ఎదురుగా పండితరాయలు నేరస్తుని వలె చేతులు కట్టుకొని నిలబడి ఉన్నాడు.

'పండితరాయా, నీ నేరం ఒప్పుకొంటున్నావా?' 'చిత్తం ప్రభూ తమరే శిక్ష విధించినా నేను సిద్ధమే.' చిరునవ్వు నవ్వాడు చక్రవర్తి. "అయితే నీకు కఠిన దండనే అవసరం" లేచి నిలబడి సభాసదుల వైపు తిరిగాడు చక్రవర్తి. "ఈ పండితరాయలు రాజాగ్రహాన్ని సహితం లెక్కచేయక హృదయం ప్రేమతో నింపుకొన్నాడు. రాజాస్థాన కవీశ్వర పదవిని తృణప్రాయంగా ఎంచి ప్రేమే శాశ్వతం అనుకున్నాడు. ఈ యువకుని నిష్కల్మష ప్రేమను శాశ్వతం చేయాలని మేం కోరుతున్నాం. అందుకే లవంగి కన్య నిచ్చి, రాజోచిత లాంఛనాలతో వివాహం జరిపించాలని నిర్ణయించాం." అని సెలవిచ్చాడు. సభాసదు లంతా ఆనందంతో కరతాళ ధ్వనులు చేశారు. పైనున్న బాల్కనీ తెర వెనుక నిలబడిన లవంగి ఆనందంతో వివశ అయింది.

"ప్రభూ, మీరు దయామయులు. మీ మనస్సు నొప్పిస్తే యీ విప్రుని క్షమించండి" అన్నాడు జగన్నాధుడు. సింహాసనం దిగి క్రిందికి వచ్చి జగన్నాధుని భుజం తడుతూ "ఆనాడు ఓ కఠిన శిలా సదృశమైన హృదయం నీ హృదయాన్ని పగిల్చిందన్నావు కదా. అదే హృదయం యీనాడు నీపట్ల వాత్సల్యంతో నిండిపోతూంది. అంతే నమ్మలేవా? కులమత భేదాలను అధిగమించిన మానవహృదయాలను ఏకం చేసేది ఒక్క ప్రేమే అని నేనూ తెలుసుకున్నాను పండితవర్యా" అన్నాడు షాజహాన్.

సభలోని కోలాహలాన్ని చీల్చుకుంటూ పైనుంచి ఒక చావు కేక విన వచ్చింది. తెరమరుగున నిలచిన లవంగిని కటారుతో పొడిచి లోనికి వెళ్ళి పోయింది. లవంగి బాల్కనీ మీదనుంచి క్రిందికి వాలింది.

ఒక్క పరుగున జగన్నాధుడు లవంగిని అందుకున్నాడు. ఆమె మూర్ఛపోయి వుంది. "ఎంత దారుణం, ప్రభూ, ఒక్క ఆ విశ్వేశ్వరుడు మినహా లవంగిని ఎవరూ రక్షించలేరు. నే నీమెను కాశీకి తీసుకువెళ్ళడానికి అనుజ్ఞ ఇవ్వండి ప్రభూ ఆలస్యం చేయకండి" అని ప్రాధేయపడ్డాడు.

"అదే నీ నమ్మకం అయితే నిన్నూ లవంగినీ హుటాహుటిని కాశీ తరలించే ఏర్పాట్లు చేస్తాను. అసఫ్‌ఖాన్, అన్ని ఏర్పాట్లూ తృటిలో చేయించండి" అని అజ్ఞాపించాడు షాజహాన్.

అసఫ్‌ఖాన్ త్వరగా ఏర్పాట్లు చూడడానికి కదిలాడు.

## 22

కాశీ పట్నం అంతా గోల గోలగా వుంది. డిండిమభట్టు పండితరాయనిపై కత్తి కట్టాడు. చక్రవర్తి తననే చేపట్టే మొనయిగాడా జగన్నాధుడు అన్న ఈర్ష్య అతగాడిని దహించి వేస్తూంది. అంచేత ప్రతీకారం చేయాలని కంకణం కట్టుకున్నాడు. లవంగిని తీసుకొని విశ్వేశ్వర దర్శనార్థం జగన్నాధుడు వస్తున్నాడని తెలిసినది మొదలు ఆతని కోపం బుసలుకొడు తూంది. ద్వేషాగ్ని జ్వాలలు ఆజ్యం పోసిన అగ్నిలాగా రేగుతున్నాయి కాశీ బ్రాహ్మణుల నందరినీ కూడ గట్టాడు. గంగ గట్టుపై సమావేశ పరిచాడు. "ఎంత విద్వాంసుడైతేమటుకు? మహమ్మదీయ వనితను తీసుకువచ్చి దైవం ముందు వివాహం చేసుకుంటాననడానికి ఎన్ని గుండెలు?" అని అందర్నీ రెచ్చ కొట్టాడు. 'అవును ఈ జగన్నాధుని పొగరు అణచవలసిందే—మరీ యింత అపచారమా? అన్నారు." కాశీలో అడుగు పెట్టడాని కెంత ధైర్యం. విశ్వేశ్వరాలయంలో ప్రవేశించ నియ్యం.' అన్నారు. "అవును ఆలయప్రవేశం నిషేధించాలి. అంతేకాదు, పవిత్రగంగని తాకనివ్వ కూడదు. అమాతని అపవిత్రం చేయనీయ కూడదు." అన్నారు.

"ఆలయం మూయించేద్దాం. గంగా ఘట్టాలన్నీ గస్తీ కాద్దాం" అన్నాడు డిండిమభట్టు.

ఆగమేఘాల మీద కాశీ పట్నం చేరిన జగన్నాధుడు లవంగిని తన చేతుల్లో ఎత్తుకొని ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టాడు. కాని ఏంప్రయోజనం. బలమైన గొలుసులతో ఆలయ సింహద్వారపు

# యువ

పాఠకులకు, ప్రకటనదారులకూ

## దీపావళి శుభాకాంక్షలు

తలుపులు బిగింపబడి ఉన్నాయి.

నిస్పృహతో గంగానదీ తటాన్ని చేరాడు. పుణ్యనదీ తీరాలు లవంగికి ప్రాణదానం చేస్తాయి అని అతని నమ్మకం. కాని అక్కడ స్నాన ఘట్టాల్లోకి ఒక్కమెట్టు కూడా దిగనివ్వలేదు బ్రాహ్మణులు.

ఆలయంముందు ఘట్టంలోని పైమెట్టు మీదే నిస్సహాయంగా నిలబడి పోయాడు జగన్నాధుడు. అతని హృదయం ఆవేదనతో నిండి అలసిపోయింది. సహనం నశించి ఆగ్రహం తలెత్తుతోంది. పై మెట్టుపై లవంగిని భద్రంగా పడుకోపెట్టాడు.

పవిత్ర గంగకు భక్తితో నమస్కరిస్తూ 'గంగా మాతా, నీకు యింత కినుకా? నా ప్రేయసిని బ్రతికించాలంటే నీవే దిక్కని వచ్చానే—నీ పావనోదకంలో కడిగిన గాయాలు శాశ్వతంగా పోతా యన్నది నిజంకాదా? నాకా అవకాశమే యివ్వవా?' అనివాపోయాడు.

పక్కనే వున డిండిమ భట్టు 'మంత్రాలకు చింతకాయలు రాలే రోజులా యివి విప్రోత్తమా!' అంటూ హేళన చేశాడు.

జగన్నాధునికి ఆవేశం ఆగ్రహం ముప్పిరిగొని వచ్చాయి. 'నా యీ భక్తి వృధా ఏనా? నాయీ నిష్కల్మషహృదయం రాయి కావల సిందేనా?—గంగామాతా నా భక్తి పూరితలహరిలో నీవు కరిగి వస్తావులే అంటూ స్తవం చదవడం ప్రారంభించాడు. అతని గంగాల హరిలో గంగనాట్య మాడుతుందా అనిపించింది. ఆవేశంతో గంభీ రంగా చదువుతున్నాడు.

ఉవ్వెత్తున గాలిలేచింది. ఉరుములు మెరుపులు కారుమేఘాలు కమ్ముకొని ప్రపంచం ప్రకృతి భీకరరూపం దాల్చింది. వర్షం ప్రారంభం అయింది. గంగాతీరాన వున్న జనం అదరిపడ్డారు. గంగ ఒకొక్కమెట్టుగా పైకి లేస్తూంది.

స్తవం పూర్తిచేసి కళ్లుమూసుకుని నిలబడ్డాడు, జగన్నాధుడు. అతని పాదాలముందుదాకా పైకి వుప్పొంగి వచ్చింది గంగ. సంతోషంగా వంగి ఆపవిత్ర జలాల్ని దోసిట పట్టి కళ్ళకి అద్దుకున్నాడు జగన్నాధుడు. వాటిని లవంగి ముఖంపై జల్లి తన వుత్తరీయంతో ఆమె ముఖం తుడిచాడు.

లవంగి కన్నులు తెరిచి జగన్నాధుని చూసింది. ఆలయపు గంటలు విజయగంటలవలె అదేపనిగా మ్రోగాయి.

విశ్వేశ్వరాలయానికి వేసిన గొలుసులు తెగిపడ్డాయి. సింహ ద్వారాలు తెరుచుకున్నాయి.

లవంగిలేచి పండితరాయని పాదాలపై వాలింది. ఆమెను లేప నెత్తి ఆలయం వైపు నడిపించాడు జగన్నాధుడు.

వాతావరణం భీకర రూపం చాలించింది. బ్రాహ్మణులు తమ తప్పు తెలుసుకుని తలలు వంచారు. డిండిమభట్టుకి ముఖం చెల్లక అక్కడి నుంచి తొలగిపోయాడు.

లవంగితో సహా పండితరాయలు ఆలయంలో ప్రవేశించి గంట కొట్టాడు.

అతని వెనువెంటనే బ్రాహ్మణుల సమూహం కూడా....ఆలయం లోకి ప్రవేశించారు.

లవంగి పాణీగ్రహణం జరిపి ఆ విశ్వేశ్వరుని ముందు మోక రిల్లాడు జగన్నాధుడు. అతనితోపాటు లవంగి కూడా మోకరిల్లింది.

విశ్వేశ్వరుని రూపు వింత వెల్గులు వెల్గిందనిపించిం దక్కడి జన సమూహానికి.

———

**Published by A. Thirupathi Rayudu at No. 1, Arcot Road, Madras-26 and Printed by G. Veera Brahmam at his Anuradha Acchagam, 146, T. H. Road, Madras-21**

**Controlling Editor: "CHAKRAPANI"**